ఆచరణాత్మక అనుభవమే ప్రగతికి సోపానం

- ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్



నతెలంగాణ-పటాన్‌చెరుఫ

పాఠ్యాంశాలను మొక్కుబడిగా చదివి ఉత్తీర్ణులవడం కంటే ఆచరణాత్మక అనుభవాన్ని పొందడం వల్ల కలిగే ప్రయోజనాలు మిన్న అని, ఆచరణాత్మక అనుభవమే ప్రగతికి సోపానమని ఎన్ఐటి వరంగల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ కుమార్ పాండా అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అధ్వర్యంలో 'కజీ నెట్వర్కులో వికేంద్రీకృత కంప్యూటర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సాధికారత గల వాహన తాత్కాలిక నెట్ వర్క్ పాత్రపై శుక్రవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు.వాహనాల చలనానికి సంబంధించిన సవాళ్లు, పరిష్కారాలు, కజ్ నెట్వర్క్, ధరల విధానం కోసం వినియోగించే అల్గోరిథం గురించి డాక్టర్ పాండా వివరించారు. ఫాగ్ నోడ్స్ (ఎఫ్ఎన్) ద్వారా శక్తి వినియోగాన్ని తగ్గించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఈ అతిథ్య ఉపన్యాసంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని, కజీ నెట్ వర్క్ అభివృద్ధిలో ఫాగ్-సాధికారత వాహనాల తాత్కాలిక నెట వర్క్ ల పాత్రల పై పలు విషయాలను తెలుసుకున్నారు.

1

నవతెలంగాణ

మెదక్

శనివారం | 03 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ఇసుక రవాణను పూర్తిగా నిషేధించాలి

- తహసిల్దార్ కు గాగీల్లపూర్ గ్రామస్తుల వినతిపత్రమందజేత

నవతెలంగాణ-బెజ్జంకి



ప్రభుత్వ అభివృద్ధి నిర్మాణ పనుల అవసరాలకు అధికారులు ఇసుక తరలింపుకు అనుమతులు జారీ చేస్తే..అనుమతుల పేరునా రవాణదారులు ఇసుకను అక్రమంగా పక్కదారి పట్టిస్తున్నారని మోయతుమ్మెద వాగులో ఇసుక తవ్వకాలను పూర్తిగా నిషేదించాలని మండల పరిధిలోని పలువురు గాగీల్లపూర్ గ్రామస్తులు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్ యందు తహసిల్దార్ ఎర్రోల్ల శ్యామ్ కు వినతిపత్రమందజేశారు. అక్రమ రవాణదారులు ఇష్టారాజ్యాంగ ఇసుక తవ్వకాలు జరుపుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని.. సాగుచేసిన పంటలు నీరందక ఆందోళన చెందుతున్నామని రైతులు తహసిల్దార్ వద్ద అవేదన వ్యక్తం చేశారు.

చేళ్లల్లో పత్తి... చేతులెత్తేసిన సీసీఐ

- కొనుగోలు కేంద్రాల మూత
- సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో రైతులకు తిప్పలు
- రైతుల ఆందోళనతో కొనుగోళ్లు
- చివరి వరకూ పత్తిని కొనుగోలు చేయాలి: జయరాజు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

చేళల్లో పత్తి ఏరకముందే సీసీఐ కొనుగోళ్లకు చేతులెత్తేసింది. రైతుల వద్ద ఉన్న పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండానే కొనుగోలు కేంద్రాల్ని మూసేసింది. సీసీఐ మొక్కుబడి కొనుగోళ్లతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యాపారులకు లాభం చేకూర్చేందుకే ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోళ్లకు బ్రేకులు వేసింది. పలు చోట్ల రైతులు ఆందోళన బాటపట్టేసరికి కొనుగోలు కొనసాగుతాయని అధికారులు చెబుతున్నారు. సీజన్ ప్రారంభంలో ఆలస్యంగా సెంటర్లను పెట్టిన సీసీఐ చివరి వరకూ కొనుగోళ్లు చేయకుండా ముందే బంద్ చేస్తూ వ్యాపారులకు లాభాలు చేకూరుస్తోంది. దీంతో పత్తి అమ్మకాల కోసం రైతులు అనేక తిప్పలు పదాల్సి వస్తుంది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో పత్తి సాగు గణనీయంగా పెరుగుతోంది. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో వరి సాగు కంటే పత్తినే అధికంగా సాగవుతుంది. సంగారెడ్డి జిల్లాలో 357472 ఎకరాల్లో పత్తి సాగవ్వగా మెదక్ జిల్లాలో 50 వేల ఎకరాలు, సిద్దిపేట జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 8 లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగైంది. ఎకరాకు సగటున 7 నుంచి పది క్వింటాళ్ల వరకు దిగబడులు వస్తాయి. మూడు జిల్లాల్లోనూ వర్షాలు సంవృద్ధిగా కురియడం, వాతావరణం సహకరించడం వల్ల ఈ సారి పత్తి పంటకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. దిగుబడులు కూడా ఆశించిన మేరకు వచ్చినప్పటికీ పత్తిని అమ్ముకోవడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. పంట చేళ్లల్లో ఉండగానే కొనుగోలు చేసే నాథుడు లేకుండా పోయే సరికి తక్కువ ధరకే వ్యాపారాలకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రైతులు పండించిన పంటనంతా కొనుగోలు చేయాలి. కనీస మద్దతు ధర ఇవ్వాలి. కానీ..! సీసీఐ నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



రైతుల్ని నష్టపరిచేలా సీసీఐ వ్యహారం

రైతులకు మేలు చేయాల్సిన సీసీఐ తీవ్రంగా నష్టం చేసే పద్దతిలో వ్యవహారిస్తుంది. ఈ ఏడాది పత్తి సీజన్ ఆరంభంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో సీసీఐ ఆలస్యం చేసింది. తొలుత ఏరిన పత్తిని రైతులు అమ్ముకునేందుకు వస్తే జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాల్ని షురూ కాలేదు. దీంతో రైతులు తమ పత్తిని వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకే విక్రయించారు. రూ.5500 నుంచి ఆరు వేల లోపే పత్తిని అమ్ముకోవాల్సి వచ్చింది. సీసీఐ ఆలస్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతు సంఘాల ఆందోళన ఫలితంగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్ని షురూ చేసింది. అంతలోపే 20 శాతం వరకు పత్తిని వ్యాపారులు తక్కువ ధరకే రైతుల నుంచి కొనుగోలు చేశారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తినే వ్యాపారులు బినామీ రైతుల పేరిట సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొంది లాభపడ్డారు. కొంత కాలం పాటు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసిన సీసీఐ పూర్తి స్థాయిలో కొనకముందే జనవరి 31న సీసీఐ కొనుగోలు కేంద్రాల్ని మూసేశారు. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో ఇప్పటికీ చేళ్లల్లో పత్తి ఏరుతునే ఉన్నారు. ఇళ్ల వద్ద నిల్వలున్నాయి. 20 శాతానికి పైగా పత్తి అమ్మకాలు చేయకముందే సీసీఐ కొనుగోలు కేంద్రాల్ని మూసేయడం వల్ల తిరిగి వ్యాపారులు



రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేయాలని చూస్తున్నారు.

చేలు, ఇళ్లల్లో పత్తి నిల్వలు

సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, జగదేవ్‌పూర్, చేర్యాల, కొండపాక, హుస్నాబాద్, బెజ్జంకి, తొగుట, దౌల్తాబాద్ మెదక్ జిల్లాలోని తూప్రాన్, నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం, రామాయంపేట, నిజాంపేట, చేగుంట సంగారెడ్డి జిల్లాల్లోని సదాశివపేట, కొండాపూర్, సంగారెడ్డి, కంది, అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్, మునిపల్లి, వట్‌పల్లి, రాయికోడ్, ఝరాసంఘం, గుమ్మడిదల, పుల్కల్, హత్నూర, కంగ్టి, మనూరు వంటి ప్రాంతాల్లో పత్తి అధికంగా సాగు చేశారు. ఇప్పటికీ 20 శాతం వరకు పత్తి చేలు, రైతుల ఇళ్లల్లో ఉంది. అనేక చోట్ల రైతులు పత్తి ఏరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల వల్ల పత్తి తెంపేదుకు లేబర్ కొరత ఏర్పడడం వల్ల పత్తి ఏరే పనుల్లో ఆలస్యమైందని రైతులు చెబుతున్నారు.

చేతులెత్తేసిన సీసీఐ

పత్తి కొనుగోళ్ల విషయంలో సీసీఐ చేతులెత్తేసింది. సిద్దిపేట జిల్లాలో ఈ సీజన్‌లో 6.16 లక్షల క్వింటాళ్ల పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది. వ్యాపారులు మరో రెండు లక్షల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశారు. ఇప్పటికీ అనేక మండలాల్లో పత్తి ఏరే పనులు కొనసాగుతున్నాయి. సీసీఐ మాత్రం జనవరి 31న కొనుగోలు కేంద్రాల్న మూసేసింది. హుస్నాబాద్‌లో 4, గజ్వేల్‌లో 6, చేర్యాలలో 6, బెజ్జంకిలో 2, సిద్దిపేట, దౌల్తాబాద్, కొండపాక, తొగుటలో ఒకటి చొప్పున సీసీఐ కొనుగోలు కేంద్రాలను పెట్టింది. వీటిల్లో అరకొరగా పత్తి కొనుగోలు జరిపి అప్పుడే కేంద్రాల్ని కట్టేసింది. సంగారెడ్డి జిల్లాలో 22 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తిని కొనుగోలు చేసింది. జోగిపేట, నారాయణఖేడ్, సదాశివపేట, రాయికోడ్, వట్‌పల్లి కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు సాగాయి. వీటిల్లో 75.200 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. ఇంకా రైతుల వద్ద పత్తి ఉన్నది. సీసీఐ వైఖరి వల్ల సదాశివపేటలో రైతులు ఆందోళనకు దిగారు.

మొత్తం పత్తిని కొనుగోలు చేయాలి: జి.జయరాజు, రైతు సంఘం నాయకులు



రైతులు పండించిన పత్తినంతా కొనుగోలు చేయాలి. సీసీఐ కేంద్రాల్ని మూసేయడం వల్ల రైతులు నష్టపోతారు. వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు వీలుగా సీసీఐ పనిచేస్తుంది. జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని రైతులు తెచ్చిన పత్తినంతా కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. లేని పక్షంలో రైతుల్ని సమీకరించి ఉద్యమించాల్సి వస్తది. కొన్ని గ్రామాల్లో రైతులు పత్తిని ఏరుతున్నారు. కొంత మేరకు ఇళ్లల్లో నిల్వ చేశారు. అదంతా కూడా సీసీఐనే కొనుగోలు చేయాలని జిల్లా అధికారులకు విన్నవించాం.

సర్పంచ్ పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి తాడూరి రవీందర్

- పార్టీకి, పదవికి అంకితభావంతో పనిచేశారు
- సీపీఐఎం ఆధ్వర్యంలో ఘన సన్మానం

నవతెలంగాణ- కొమురవెల్లి



సర్పంచ్ పదవికే వన్నె తెచ్చిన వ్యక్తి తాడూరి రవీందర్ అని సీపీఐఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్‌ను పార్టీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి రవీందర్ ఎంతో కృషి చేశారన్నారు. సర్పంచ్ పదవిలో ఉన్నా పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా అంకితభావంతో పని చేశాడని కొనియాడారు. సీపీఐఎం సర్పంచ్‌గా మండలంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడన్నారు. ఐదేళ్ల పదవీ కాలంలో మండల సర్వసభ్య సమావేశాల్లో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించిన సంగతిని గుర్తు చేశారు. రవీందర్‌ను అనేక పార్టీలు ప్రలోభ పెట్టినా సీపీఐఎంను వదిలిపెట్టలేదని, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తూ జిల్లా, రాష్ట్ర పార్టీ ప్రశంసలు పొందాడని గుర్తు చేశారు. గ్రామంలో అన్ని పార్టీల వ్యక్తులతో కలివిడిగా ఉంటూ తనదైన శైలిలో సమస్యలు పరిష్కరించాడన్నారు. రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పలువురు నాయకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి, దాసరి ప్రశాంత్, వార్డు సభ్యులు మహేందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు, తాడూరి మల్లేశం, కర్రోల్ల ఎల్లయ్య, నీల బిక్షపతి, చక్రపాణి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం పట్టని మోడీ ప్రభుత్వం

- కార్పొరేట్లకు వరాలు...ప్రజలపై భారాలు
- 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

నవతెలంగాణ -కొండాపూర్



కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం అన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం మల్లేపల్లి గ్రామంలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలైనా కార్మికుల, రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. అచ్చేదిన్ ఆయాగా మేకిన్ ఇండియా అంటూ మోసపూరిత నినాదాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నేటికీ ఏం చేయలేకపోయిందన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు,పేద కుటుంబానికి 15 లక్షల రూపాయలు అకౌంట్ లో జమ చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల మీద దాడి చేసి నాలుగు లేబర్ కోడ్ తెచ్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. రైతాంగాన్ని ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం రైతులను మోసం చేసి నల్ల చట్టాలు చేసిందన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరం పాటు పోరాటం చేసి మోడీ మెడలు వంచిన చరిత్ర రైతాంగానికి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదలను ఆదుకోవడం కోసం యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి చట్టాన్ని తెస్తే మోడీ ప్రభుత్వం ఆ చట్టాన్ని నిర్వర్యం చేస్తూ కూలీలకు ఉపాధి లేకుండా నిధులు తగ్గించి వ్యవసాయ కూలీల పుట్టగొడుతుందన్నారు. ధరలు విపరీతంగా పెంచి మధ్యతరగతి ఉద్యోగులను ప్రజలను నడ్డి విడిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన రోజులు దగ్గరలో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక కర్షక రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించి మోడీకి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రాంతం కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కూలీలు గ్రామీణ బంద్ నిర్వహించి ఎక్కడికక్కడ దిగ్బంధం చేసి మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బాబురావు, పల్లె రాందాస్, రమేష్, శ్రీధర్, శివ పాల్గొన్నారు

అర్హులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని ధర్నా

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో ఇల్లు లేని పేదలకు డబల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యతగా గతంలో పట్టా సర్టిఫికెట్లు పొందిన ఇళ్లు లేని పేదలకు, వికలాంగులు, వితంతువులకు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం నిరుపేదలు సీపీఐ (ఎం)అధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆర్డీవో బన్సిలాల్ కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో సుమారు 300 వరకు బిల్డింగులు, ఇళ్లు, భూములు ఉన్న వారి పేర్లు వచ్చాయని, వారందరినీ సమగ్ర సర్వే నిర్వహించి తొలగించాలని డిమాండ్ చేశారు. డబల్ బెడ్ రూమ్ లబ్దిదారుల ఎంపిక సమగ్రంగా నిర్వహించలేదన్నారు. గజ్వేల్ లో ఆధార్ కార్డు గుర్తింపు లేని వారు, చనిపోయిన వారి పేర్లు కూడా జాబితాలో వచ్చాయంటే డబల్ బెడ్ రూమ్ ఎంత మోసం జరిగిందో అర్థమవుతుందన్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురు, భవనాలు ఉన్న వాళ్లకు డ్రా ఎంపికలో పేర్లు వచ్చాయన్నారు. గతంలో పట్టా సర్టిఫికెట్ పొంది అద్దెకు ఉంటున్న వాళ్ల పేర్లు రాలేదన్నారు. గతంలో మూడు సార్లు ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారన్నారు. అనర్హుల జాబితాకు సంబంధించిన వివరాలు అనేక మందికి తెలియదన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇండ్లు లేని వాళ్లకు న్యాయం చేయాలన్నారు. లేనిచో ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఆర్డీవో బన్సీలాలు మాట్లాడుతూ అనర్హుల పేర్లను పరిశీలన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ బాధితులు తల కొక్కుల పద్మ, నర్సింలు, మహేందర్, కవిత, లక్ష్మీ, నరహరి, నరేందర్, జ్యోతి ,విజయలక్ష్మి, భవాని, కిష్టయ్య, సంతోష ,వినోద తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో కూడిన బడ్జెట్

- ప్రభుత్వ విద్యా రంగం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదు
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



అబద్ధాలతో కూడిన బడ్జెట్ అని ప్రభుత్వ విద్యా రంగం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదు అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రెస్ మీట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ దేశంలో మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విద్యారంగం గూర్చి అబద్ధాలు మాట్లాడారని అని అన్నారు.విద్యకు సంబంధిత ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీ నుండి ప్రభుత్వం 5 శాతానికి తగ్గించిందని, తాము ఆయా వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయాలని అన్నారు. మంత్రి ప్రసంగంలో ఉన్నత విద్యారంగంలో విద్యార్థినీల గ్రాస్ ఎన్రోల్మెంట్ 28% పెరిగిందనీ, సైన్స్,టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినీల చేరిక 43% శాతంగా నమోదైందనీ ప్రపంచంలో అత్యుత్తమమైనదనీ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం విద్యార్థినీల చదువుల పట్ల అంకిత భావంతో లింగ సమానత్వం కోసం పనిచేస్తుందనడం ఒట్టి బూటకపు మాటలు అని తెలిపారు. 2014లో బిజెపి అధికారం చేపట్టిన నాటినుండి విద్యార్థినీలు చదువులకు దూరమయ్యారని, బిజెపి ప్రభుత్వానికి విద్యార్థినీల చదువుల పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్ర విశ్వవిద్యాలయాల్లో, కేంద్రీయ విద్యాలయాల్లో నవోదయాల్లో విద్యార్థినీల చదువుల కోసం ప్రభుత్వం ఏమి చేసిందన్నారు. కేంద్ర విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందని, ప్రతి ఏటా విద్యార్థినీల డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా పెరిగిందనీ అన్నారు. దేశంలో స్కిల్ ఇండియాలో భాగంగా 1.4 కోట్ల మంది యువతను నైపుణ్యం కలిగిన యువతగా తీర్చిదిద్దామని చెబుతున్న ప్రభుత్వం దేశంలో ఎంతమంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో చెప్పాలన్నారు. నూతన మెడికల్ కళాశాలలుఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం 2019లో నేషనల్ మెడికల్ కమీషన్ లో అనేక మార్పులను చేస్తూ తీసుకొచ్చిన చట్టం విద్యార్థులకు ఉరితాడుగా మారిందన్నారు. నూతన ఉన్నత విద్యాసంస్థలు, ఐటిఐలు,ఐఐటీలు, మెడికల్ కళాశాలలు,ఐఐఎం లు,ఎయిమ్స్ కళాశాలలు, ఏర్పాటు చేసినప్పటికీ ఆయా విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను కల్పనకు నిధులు కేటాయించాలడం లేదన్నారు. 390 కి పైగా ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులిచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారన్నారు. నూతన జాతీయ విధానం ద్వారా రాష్ట్రాల హక్కులను లాక్కొని విద్య పై కేంద్రం పూర్తి స్థాయి నియంత్రణ కోసం ప్రయత్నిస్తోందన్నారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని కోరారు.

గణతంత్ర దినోత్సవ పెరేడ్ లో కళా వైపుణ్యాన్ని ప్రదర్శించిన గీతం విద్యార్థిని

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్ఎస్) లోని విజువల్ కమ్యూనికేషన్స్ బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని భావరాజు నందిని న్యూఢిల్లీలో జనవరి 26న నిర్వహించిన 75వ జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకల సాంస్కృతిక ప్రదర్శనలో తన ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని ఆమె అధ్యాపకురాలు సంధ్యా గాండే శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.దేశ, విదేశాల నుంచి తరలి వచ్చిన అతిథులు, పలువురు రాయబారులు, పౌర, సైనిక ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించిన గణతంత్ర వేడుకలలో గీతం విద్యార్థిని పాల్గొని, తన కళా నై పుణ్యాన్ని ప్రదర్శించడం ఓ మరుపురాని అనుభూతిగా ఆమె అభివర్ణించారు. ఆమె కళాభినయానికి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందాయని, గీతం లో పెంపొందించిన సాంస్కృతిక చైతన్యం.కళాత్మక నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.ప్రతిష్ఠాత్మక గణతంత్ర వేడుకలలో ఎన్సీసీ కేడట్గా కళాభినయాన్ని ప్రదర్శించే అవకాశం అందుకున్న భావరాజు నందినిని గీతం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, జీఎస్హెచ్ఎస్ డైరెక్టర్ సన్నీ గోస్మాన్ జోస్, పలువురు విభాగాధిపతులు, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించినట్టు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక కార్యక్రమానికి నందినిని సిద్ధం చేయడంలో తనవంతు సహకారం అందించినట్టు అధ్యాపకురాలు సంధ్యా గాండే ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మూడు రోజులుగా కొనసాగుతున్న కార్మికుల సమ్మె

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని రాఘవపూర్ ఫిల్టర్‌లో మిషన్ భగీరథ కార్మికుల సమ్మెబాట పట్టామమని మిషన్ భగీరథ కార్మికులు గోపాల్ రెడ్డి అన్నారు. మిషన్ భగీరథ కార్మికులు చేపట్టిన సమ్మె మూడు రోజులుగా కొనసాగుతుందన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 10 నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మిషన్ భగీరథ జిల్లా అధికారులు సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమ్మెలో గోపాల్ రెడ్డి, రాములు, రాకేష్, కృష్ణ, సురేష్ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు స్వీట్స్ పంపిణీ



నవతెలంగాణ-అక్కన్నపేట: ఉపాధి హామీ పథకం ఆవిర్భవించి 19 సంవత్సరాలు గడిచిన సందర్భంగా అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి నిర్మల, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ భాస్కర్ ఆధ్వర్యంలో కూలీలకు స్వీట్స్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనిని ఉపయోగించుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి, మాజీ వార్డు సభ్యులు నిర్మల, వీరమ్మ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై 4వ తేదిన అవగాహన సదస్సు



నవతెలంగాణ-సంగారెడ్డి

హెూప్ కార్డియాక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో "మన గుండె-సురక్షిత హృదయ కార్యక్రమాన్ని" ఈనెల 4న సంగారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు ప్రఖ్యాత ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా.అనిల్ కుమార్ శుక్రవారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి సేఫ్ హార్ట్-సంగారెడ్డి అవగాహన ప్రచారం ద్వార గుండెను జాగ్రతగా కాపాడుకోవాల్సిన అవసరాన్ని, పద్ధతులను గురించి తెలియజేయడం జరుగుత ందన్నారు. వీడియోల ద్వార, ప్రచార పత్రాల ద్వారా సేఫ్ హార్ట్-సంగారెడ్డి అవగాహన కార్యక్రమాలు ప్రజలలోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. సేఫ్ హార్ట్-సంగారెడ్డి అవగాహన ఈనెల ఫిబ్రవరి 4న, ఆదివారం ఉదయం 11 గంటలకు సంగారెడ్డి జెడ్పీ హాల్‌లో కార్యక్రమ నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ రూపేష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా. ఉషా కిరణ్, కార్యదర్శి డా. చక్రపాణి పాల్గొంటారన్నారు. గుండె అవగాహన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్



మండల కేంద్రమైన కల్హేర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మహా రెడ్డి కుటుంబ వీరాభిమాని పాకల చిన్న నారాయణ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను, కుమారులు పాకల శ్రీనివాస్, పాకల మల్లికార్జున్‌లను పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. అనంతరం అదే మండలంలోని మాసన్ పల్లి మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్‌కు ఇటీవల ఆపరేషన్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు మహా రెడ్డి గోపాల్ రెడ్డి శుక్రవారం వారి ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శించి ధైర్యాన్ని కల్పిం చారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నరసింహారెడ్డి, బీఆ ర్ఎస్ మండల అధ్యక్షులు రాంసింగ్, వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ దిలీప్ కుమార్, మాజీ మండల ప్రెసిడెంట్ నారాయణరావు, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సంగప్ప, గ్రామ పార్టీ ఉపా ధ్యక్షులు మాణిక్ ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని , ఉద్యోగాల పేరు మీద కార్మికులకు సంబంధించి లక్షల రూపాయలు తీసుకుంటున్న అదనపు సానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబుని ఉద్యోగం నుంచి తొలగించాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు దాదాపు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే విధులు బహిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ పేరుకే జిల్లా కేంద్రం కానీ ఇక్కడ మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు కార్మికులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దాదాపు 2 నెలల నుంచి వేతనాలు రాక కార్మిక కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్న మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. అక్రమంగా కార్మికులను తొలగించి వారి స్థానంలో కొందరిని తీసుకొని వారి దగ్గర నుంచి లక్షల రూపాయలు తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్న అదనపు శానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబుని ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను విధులకు తీసుకోవాలన్నారు. వెంటనే ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి అతని ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, సువర్ణ, సంగీత, లక్ష్మీ, మంజుల, జనార్ధన, నర్సింలు, లక్ష్మమ్మ, నరసమ్మ, మంజుల, వెంకటమ్మ, సుజాత, పుష్ప, రాజేష్ ,సురేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఈ- వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన సదస్సు



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం టీఎస్ కేసి ఆధ్వర్యంలో ఈ -వేస్ట్ మేనేజ్మెంట్ పైన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ట్రైనర్ కరుణాకర్ రెడ్డి విద్యార్థులకు ఈ వేస్ట్ మేనేజ్మెంట్ గురించి వివరించారు. ఎలక్ట్రానిక్ వేస్ట్ ను తిరిగి ఉపయోగించే విధానము, ఈ వేస్ట్ వల్ల వచ్చే అనర్థాలను విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ. రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్య కార్యక్రమాలతో పాటుగా ఇలాంటి సహ పాఠ్య కార్యక్రమాల వల్ల విద్యార్థులలో నేటి పరిస్థితుల పట్ల అవగాహన పెరుగ ుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మిగతా డిపార్ట్మెం ట్ల వారు కూడా నిర్వహించాలని, కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినం దుకు టీఎస్ కేసి డిపార్ట్మెంటును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీ. అడవిరాజు టిఎస్‌కేసి కో ఆర్డినేటర్ ఏ. అనసూర్య, టిఎస్ కే సి మెంటార్ బి. దేవి ,అకాడమిక్ కోఆర్డినేటర్ ఏ.గోపాల్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నజర్

నవతెలంగాణ-వట్‌పల్లి



ఖమ్మం జిల్లాలో ఈ నెల 11, 12వ తేదిలలో నిర్వహించనున్న రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని సంగారెడ్డి జిల్లా టిపిటిఎఫ్ ఉపాధ్యక్షులు నజర్ తెలిపారు. మరువెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బందితో కలిసి మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అవంతరాలు లేని విద్య ప్రజల హక్కు ప్రభుత్వ బాధ్యతగా అను అంశాల మీద మహాసభలను నిర్వహించారు. అసమాన సమాజంలో సమానత్వ విద్య ఫాసిజము బుద్ధి జీవుల పాత్ర మహిళల స్థితిగతులు కర్తవ్యాలు ప్రభుత్వ విధానాలు ఆర్థిక సంక్షోభము అంశాలపై ప్రొఫెసర్స్ హరగోపాలు , కాశీం బుర్ర రమేష్, నరసింహ రెడ్డి చందన చక్రవర్తి వేణుగోపాల్ వంటి విద్యావంతులు పాల్గొని ప్రసంగించనున్నారు. మహాసభల సమావేశానికి తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మంత్రులు సీతక్క పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతితులుగా పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి, కే శివకుమార్, శ్రీదేవి, సరిత, సరస్వతి, మార్వెల్లి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ బాలుర గురుకులం విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-జహీరాబాద్



భారత్ బుక్ కార్యక్రమానికి అందరూ సహకరించాలని డాక్టర్ జి నరేంద్రబాబు అన్నారు. శుక్రవారం ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్ మండలం అల్గోల్ గ్రామం లో గల తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు సాధారణ వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్ బి ఎస్ కే) కోహిర్ వైద్య బృందం డాక్టర్ జి. నరేంద్రబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సర్ఫరాజ్, ఆధ్వర్యంలో 8,9,10 తరగతి విద్యార్థులకు హిమోగ్లోబిన్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు చేపట్టారు. విద్యార్థులందరు మంచి ఆరోగ్యంతో ఉన్నట్లు వీరు నిర్ధారించారు. విద్యార్థులకు ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులకనుగుణంగా మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు చేశారు. విద్యార్థులు నిత్యం వ్యాయామం, యోగ ధ్యానం, మెడిటేషన్ చేయడం ద్వారా చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని డాక్టర్ జి. నరేంద్రబాబు వివరించారు. అంతే కాకుండా విద్యార్థులు మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.ఎస్.జమీల్, జే. రాములు, ఏ.ఎన్.ఎమ్ లు మేరీ, ఫార్మసిస్ట్ అఖిల స్టాఫ్ నర్సులు సోలమన్ రాజ్ ఇమ్రాన్, స్కూల్ కోఆర్డినేటర్ రహీం పాషా, జూనియర్ అసిస్టెంట్ సాగర్, ఇర్ఫాన్ డిప్యూటీ వార్డెన్ సమీయుద్దీన్ పీ.ఈ.టీ అనిల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కార్మికుల, ప్రజల నడ్డీ విరుస్తున్న బీజేపీ సర్కార్

నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ల కొమ్ము కాస్తూ కార్మికుల, ప్రజల నడ్డి విరుస్తున్నదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్, మహేంద్ర అండ్ మహేంద్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. 16న దేశ వ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌కు సంభందించిన సమ్మె నోటీస్‌లను పలు పరిశ్రమల్లో, అధికారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ.. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కాడ్స్ తీసుకువ చ్చింద న్నారు. ధరలను తగ్గించకుండా పెట్టుబడిదారులకు అను కూలంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు,. కార్మిక చట్టాలు రద్దు ఆపాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో ఉత్పత్తిని స్తంభింపజేసి పెద్ద ఎత్తున ఆందోళన, ఉద్యమాలు, పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు రంగాలు, పరిశ్రమల సీఐటీయూ నాయకులు సతీష్, నాగరాజు, బాల్ రాజు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి సమిష్టిగా కృషి చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



యువతను, విద్యార్థుల భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది.జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, మాదక ద్రవ్యాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై చర్చించారు. వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కాకుండా అవగాహన కల్పించడంతోపాటు వాటిని సమూలంగా అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. సమాజానికి పెను ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటుపడి వాటికి బానిసలుగా మారిన వారు వ్యక్తిగతంగా, కుటుంబపరంగా నష్టపోవడమే కాకుండా, సమాజానికి శ్రేయష్కరం కాదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై మరింత గట్టి నిఘా పెడుతూ, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలన్నారు.ఆయా శాఖలు నిషేధిత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తూ, పరస్పర సమన్వయంతో వాటి నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రస్థాయిలో మాదకద్రవ్యాల నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో జిన్నారం పరిధిలో ఆల్ఫా జోలం తయారీ చేస్తున్న ఒక పరిశ్రమను గుర్తించి మూసి వేసామని తెలిపారు. మాదకద్రవ్యాల రవాణాపై గట్టి నిఘా పెంచామని ,అన్ని కళాశాలలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఎక్సయిజ్ తదితర శాఖలకు తమ పోలీసు శాఖ ద్వారా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా గంజాయి, డ్రగ్స్ కు సంబంధించి కేసులు అయినప్పుడు, ఆ సమాచారాన్ని పోలీస్ శాఖకు ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అనిల్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, ఎమ్మెన్నార్ వైద్య కళాశాల ప్రతినిధులు, వ్యవసాయ, రవాణా, విద్య, ఎక్సైజ్,అటవీ తదితర శాఖల అధికారులు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, డీఎస్పీలు, ఆటో డ్రైవర్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



బీసీల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలి

నవతెలంగాణ-కొండాపూర్

బీసీల అభివృద్ధికి పాటుపడాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, చైర్మన్ సత్తయ్య యాదవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉద్యమకారుడు కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిసి, బీసీల అభివృద్ధి కేవలం రాజ్యాధికారంతోనే జరుగుతుందని, నామినేటెడ్ పదవులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక సంస్థల రిజర్వేషన్లను 44%కు పెంచాలని, బీసీల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రం అందజేశారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం కోసం కృషి చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ రూపేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతిపై డివిజన్‌ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోపు చార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరగాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. బాధితులకు ప్రభుత్వం తరపున అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందేవిధంగా చూడాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ కమ్యూనిటీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలని, ఎస్సీ ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న చోట ప్రభుత్వ సంక్షేమ పథకాలు అక్కడ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా విద్యారంగానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలని, పిల్లలను చదివించేలా, ఆదిశగా కృషి చేయాలని కమిటీ సభ్యులను కోరారు. ప్రతినెల డివిజన్ స్థాయిలో నిర్వహించే క్రైమ్ మీటింగ్స్ లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులను పిలుస్తారన్నారు. అంతకుముందు కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిడి అఖిలేష్ రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, డీఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు, విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాథోడ్ నరసింహులు, కె. ఇమ్మయ్య, పి. దుర్గాప్రసాద్, ఎం. చంద్రశేఖర్, బి. రామకృష్ణ, ఎన్జీవో జి . వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్, పూలే మహనీయుల బాటలో యువత నడవాలి

- కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్

నవతెలంగాణ-సంగారెడ్డి



అంబేద్కర్, పూలే లాంటి మహనీయుల బాటలో యువత నడవాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పిలుపునిచ్చారు. కేవీపీఎస్ మహనీయుల క్యాలెండర్ (2024)ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ రూపేష్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి అఖిలేష్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ పూలే మహనీయుల బాటలో యువత నడవాలి అని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మహనీయుల చిత్రప టాలు లక్ష్యాలు ఆశలతో కుడిన క్యాలెండర్ తీసుకువచ్చిన కేవీపీఎస్‌ను అభినందించారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్ మాట్లాడుతూ.. అంబేద్కర్ మహాత్మజ్యోతి భాపూలే సావిత్రిబాయి పూలే మహనీయుల ఆశయ సాధన కృషి చేస్తుందని,ఆత్మగౌరవం సమానత్వం కులనిర్మూలన కోసం నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడవయ్య జిల్లా అధ్యక్షులు పి. అశోక్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, ఇమ్మయ్య, రాజు నాయక్, రాజు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ పాల్గొన్నారు.

'సీసీఐ'లను వెంటనే తెరిపించాలి



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు
- సంగారెడ్డి డిఆర్ఓ నగేష్‌కి వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మూసివేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ నాగేష్‌కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున పత్తి పంట సాగు అవుతున్న దన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,55,802 ఎకరాల్లో సుమారు 3,55,802 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతున్నన్నారు. కానీ ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సీసీఐ 1,10,674 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారని, ప్రైవేట్ వ్యాపారులు 20,816 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేసినట్టు అధికారులు లెక్కలు చెబుతున్నా యన్నారు. ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉన్నదన్నారు. సీసీఐ పత్తిని కొనకపోవడంతో ప్రైవేట్ వ్యాపా రులు పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారన్నారు. సిసిఐ రూ.7020కి కొనుగోలు చేస్తే ప్రైవేట్ వ్యాపారులు రూ.5 నుండి 6 వేలకు క్వింటాల్ చొప్పున కొనుగోలు చేస్తున్నార న్నారు. ప్రైవేట్ వ్యక్తులు, సీసీఐ, మార్కెట్ అధికారులు కుమ్మక్కైనట్టు కనపడుతున్నదని విమర్శించారు.రైతులకు అన్యాయం చేస్తున్నా నిర్లక్ష్యంగా ఉన్న అధికారుల పై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, సీసీఐ సెంటర్‌లు తెరిపెంచాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, నాయకులు అశోక్, శివ పాల్గొన్నారు.

పటేల్‌గూడలో ఉద్రిక్తత

- అక్రమ కట్టడాలను కూల్చేసిన అధికారులు
- రాళ్లతో దాడికి యత్నించిన స్థానికులు
- నోటీసులు ఇచ్చిన పంచాయతీ అధికారులు
- ఇప్పటివరకు స్పందించని వెంచర్ యజమానులు

నవతెలంగాణ-అమీన్‌పూర్



మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై గ్రామపంచాయతీ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఇటీవల పటేల్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ వెంచర్‌కు ఏలాంటి అనుమతులు లేకుండా యాజమానులు ప్లాట్ల విక్రయాలు చేపట్టారు. దీంతో రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం అక్రమంగా నిర్మించిన సుమారు 11 ఇండ్లను కూల్చివేశారు. దీంతో స్థానికులు ఇండ్లను కూల్చి వేస్తున్న అధికారులపైకి రాళ్ల దాడికి దిగే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ రాజ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణలకు పాల్పడితే ఎవరైనా సహించబోయేది లేదన్నారు. ఇదిలావుంటే.. అక్రమ వెంచర్లు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను ఎవరు కబ్జాలకు పాల్పడిన వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మండల అధికారులకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల భద్రత తీసుకుని పటేల్‌గూడ పరిధిలోని ఓ వెంచర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్లను అధికారులు పాక్షికంగా కూల్చివేశారు. నిజానికి ఐదు రోజుల క్రితమే పంచాయతీ అధికారులు సదరు వెంచర్ యాజమానులకు నోటీసులిచ్చి వివరణ కోరారు. కానీ వెంచర్ యాజమానుల నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేకుండాపోయింది. దీంతో గ్రామపంచాయతీ అధికారులను అక్రమ కట్టడాల కూల్చివేతను చేపట్టారు. కూల్చివేత కార్యక్రమంలో పంచాయత్ సెక్రటరీలు రమేష్, బలరాం తో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-పటాన్‌చెరు

యాదవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ కాలనీలో గల గోకుల్ ఫంక్షన్ హాలులో పటాన్ చెరు యాదవ సంఘం ఆధ్వర్యంలో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసినప్పుడే విజయం సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాలకు ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖేడ్ మున్సిపల్ పీఠం హస్తగతం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నారాయణఖేడ్ మున్సిపాల్టీ పీఠం కాంగ్రెస్ హస్తగతమయింది. గత నెలలో మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మన్ పై కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. దాంతో అవిశ్వాసం నిర్వహించాలని ఆర్డీ వోకు కలెక్టర్ సర్క్యులర్ జారి చేశారు. దాంతో ఆర్‌డిఓ వెంకటేశం శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి.. అవిశ్వాస తీర్మానం నిర్వహించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 2/3 వంతు మెజార్టీ ఉండాలి. మున్సిపల్ అవిశ్వాసం నెగ్గాలంటే 12 మంది సభ్యులు అవసరం ఉండగా.. 11 మంది కౌన్సిలర్లు, 2 ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిసి మొత్తం 13 మంది సభ్యులు కాంగ్రెస్‌కు ఉండడంతో అవిశ్వాసం నెగ్గింది. కాగా ఈ సమావేశానికి ఇద్దరు ఎక్స్‌అఫీషియో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ సంజీవరెడ్డి జీవన్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ సెట్కార్, శంకర్ సెట్, నర్సింలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధనాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బొల్లారంలో సీఐటీయూ, టీఆర్ఎస్కెవీ, ఐఎన్టియుసి, హెచ్ఎంఎస్ వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో టీఆర్ఎస్కెవీ రాష్ట్ర నాయకులు వరప్రసాద్ రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కే రాజయ్య ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లగూర్ల లక్ష్మారెడ్డి నాయకులు మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ విధానాలపై ఐక్య ఉద్యమాలు చేయాలని, సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మోడీ తొమ్మిదేండ్ల కాలంలో దేశాన్ని మొత్తం దివాళా చేయించారన్నారు. కార్మికుల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కాలేదన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి పెట్టుబడు దారులకు అను కూలంగా కార్మిక హక్కులను హననం చేశారని మండిప డ్డారు. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డీ విరిచా రని మండిపడ్డారు. ప్రభుత్వాస్తు లను తెగ నమ్ముతున్నారని, ప్రైవేటీకరణ విధానాలు వేగంగా అమలవుతున్నాయన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచారని, సెక్యులరిజాన్నీ పక్కన పడేశారన్నారు. మతోన్మాదన్ని దేశంలో రెచ్చగొడు తున్నారని, లాభాల్లో ఉన్న వాటిని ప్రయివేటు చేస్తున్నారనీ, మోడీ కార్పొరేట్, మతోన్మాద విధానాలపై జిల్లాలోని కార్మిక వర్గం పోరాడాలని కోరారు. పోస్టర్లు, సంత కాల సేకరణ, సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు, భాస్కర్ రెడ్డి, వెంక టేశ్వర్లు, సురేందర్ రెడ్డి గట్టయ్య, ఆటో, మున్సిపల్, వింధ్య, టిబిడిసి, న్యూలాండ్ తదితర పరిశ్రమ నాయకులు పాల్గొన్నారు.



గోదావరి అంజిరెడ్డిని సన్మానించిన పైడి ఎల్లారెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్

సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా ఎంపికైన గోదావరి అంజిరెడ్డిని ఘనంగా సన్మానించినట్లు ఎల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నాయకులు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సన్మానం



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధి గ్రామమైన జప్తి శివనూర్ గ్రామ పంచాయితీలో వైస్ ఎంపిపి సుజాత శంకర్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షేక్ షరీఫ్ దంపతులకు, ఉప సర్పంచ్ రేణుక పోచయ్య దంపతులకు వైస్ ఎంపిపి సుజాత, పాలక వర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నయీం, జగన్, సతీష్ బాబు, స్వాతి స్వామి, సునీత మహేందర్, సాలమ్మ గంగయ్య, పంచాయితీ కార్యదర్శి రాజు, గ్రామ మాజీ సర్పంచులు అంజయ్య, పర్శు రాములు, మాజీ ఉప సర్పంచ్ రుక్మొద్దీన్, బాల మల్లయ్య, కే అంజయ్య, ఎస్కే గౌస్, ఎస్కే పాషా, సిద్ధి రాములు, పాపయ్య, ఎం సిద్దయ్య, జి భిక్షపతి, నాగేష్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజల రుణం మరువలేనిది

- రెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ అశోక్ గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

గ్రామానికి ఐదు సంవత్సరాలు సేవచేసే భాగ్యం కల్పించినందుకు గ్రామ ప్రజల రుణం మరువలేనిదని రెడ్డిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ అన్నారు. రెడ్డిపల్లి ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ పదవి కాలం ముగిసినందున జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ఉప సర్పంచ్ అశోక్ గౌడ్ నుశాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ తనను వార్డు మెంబర్‌గా , ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్న గ్రామ ప్రజల రుణం ఎప్పటికీ మరవనన్నారు. ఐదు సంవత్సరాల పాలనలో ఉప సర్పంచ్‌గా ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తెలిసి తెలియక గ్రామ ప్రజలను అభివృద్ధి విషయంలో ఏదైనా ఇబ్బందులకు పెడితే తనను క్షమించాలని ప్రజలను కోరారు. తనకు రాజకీయంగా మంచి పేరు రావడానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఎంతో కృషి చేశారన్నారు .

పదిలో వంద శాతం ఫలితాల సాధనే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

విద్యార్థులు భవిష్యత్‌పై మంచి ప్రేరణ కలిగి ఉండాలని, పదో తరగతిలో శత శాతం ఫలితాలు లక్ష్యంగా పెట్టుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్ టీఎన్జీవో భవన్‌లో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు ప్రేరణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులు మంచి జీవితం కోసం ప్రేరణా కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అనుభవమైన ఉపాధ్యాయులతో పాటు అన్ని రకాల పుస్తకాలు, స్నాక్స్ అల్ ఇన్ వన్ లాంటి స్టడీ మెటీరియల్స్‌ను, విద్యార్థులకు క్రమం తప్పకుండా అందిస్తున్నామన్నారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థుల కోసం, ప్రత్యేక స్టడీ హవర్స్, ప్రత్యేక ట్యూటర్స్‌లను నియమించి అనుభవం గల నిపుణులతో ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జీవితంలో మంచి భవిష్యత్‌కు పదవ తరగతి కీలకమన్నారు. పదవతరగతిలో ఉన్న సబ్జెక్ట్‌లను నిర్లక్ష్యం చేయొద్దని, పదవ తరగతి సబ్జెక్ట్‌లు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ఉండే సివిల్స్, గ్రూప్ 1,2,3 లాంటి పరీక్షలు ఉపయోగ పడతాయన్నారు. పరీక్షలు కొన్ని రోజులే సమయం ఉన్నందున సమయాన్ని వృథా చేయొద్దన్నారు. టీవీ, ఫోన్, సోషల్ మీడియాలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఏబిసిడి గ్రూప్‌ల విద్యార్థులను విభజించామని , సిడి గ్రూపు విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు సమన్వయముతో చదువుకోవాలన్నారు. హాస్టల్ లో విద్యార్థులను హాస్టల్ వార్డెన్లు ఉదయం నిద్ర లేపి చదివించాలని, పరీక్షల సమయంలో లో విద్యార్థులను క్రమశిక్షణగా ఉండేలా బాధ్యత తీసుకోవాలన్నారు. 10వ తరగతిలో శత శాతం ఫలితాలు లక్ష్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ హాస్టల్ లలో 260 మంది విద్యార్థులు ఈ ఏడాది పదవతరగతిలో పరీక్షలకు సిద్ధంగా ఉన్నారని, విద్యార్థులు అన్ని సబ్జెక్ట్ లలో మంచి మార్కులు వచ్చేలా విషయ నిపుణులతో ప్రేరణా తరగతులు నిర్వహిస్తున్నామని, ఉదయం, సాయంత్రం స్నాక్ అందిస్తున్నామన్నారు. అంతకు ముందు వివిధ సబ్జెక్ట్ నిపుణులు విద్యార్థులకు ప్రేరణా తరగతులు బోధించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, జిల్లా కార్యదర్శి రవికుమార్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, హాస్టల్ వార్డెన్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గాలకు వీడుకోలు సన్మానం



నవతెలంగాణ-కౌడిపల్లి

మండలంలోసర్పంచుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా మండల పరిధిలోని కుకుట్లపల్లి, నాగ్సాన్ పల్లి, కంచనపల్లి, దేవులపల్లి తదితర గ్రామాలలో గ్రామస్తులు యువజన సంఘాల నేతలు సర్పంచులకు పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి పంచాయతీ పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు సుజాత కాంతారావు, అల్మాయపేట ఎల్లం, పద్మ కిష్టయ్య, రజిని సుధాకర్, ప్రమీల సత్తయ్య, లు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాలనలో చేసిన అభివృద్ధి కోసం విశిష్ట సేవలందించినందుకు సర్పంచులను అభినందించారు. పదవికేగాని ప్రజాసేవకు కాదని ఐదేళ్ల పదవీకాలంలో గ్రామ అభివృద్ధి కోసం ఎంతగానో శ్రమించి స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి చేసినందుకు గర్వంగా ఉందన్నారు. పదవి ముగిసినప్పటికీ ప్రజాసేవ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపసర్పంచులు, పాము నరహరి, వార్డు సభ్యులు నీరుడు విట్టల్, పెంటమ్మ, లక్ష్మి రవీందర్, లక్ష్మి, వీరమని శ్రీనివాస్, రాజయ్య, పంచాయతీ కార్యదర్శులు శైలజ , గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు మొండి చెయ్యి

- 4శాతం రిజర్వేషన్ అమలు చేయాలి
- 2016 ఆర్పిడి చట్టానికి భిన్నంగా ఉద్యోగ నియామకాలు
- ఎన్పిఆర్డి జిల్లా గౌరవం అధ్యక్షులు బస్వరాజు



నవతెలంగాణ-మెదక్

రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామకల్లో వికలాంగులకు మొండి చెయ్యి చూపిందని ఎన్పిఆర్డి జిల్లా గౌరవం అధ్యక్షులు బస్వరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎన్పిఆర్డి మెదక్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, గురుకుల విద్యాలయాలు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో 7094 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ కోసం వ్రాత పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. అర్హత కలిగిన అనేక మంది వికలాంగులు పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినారని తెలిపారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయినప్పటికీ అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు మోసం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న స్టాఫ్ నర్సు పోస్టుల్లో వికలాంగులతో భర్తీ చేయడం లేదన్నారు. ప్రభుత్వం భర్తీ చేస్తున్న 7094 పోస్టుల్లో 4శాతం ప్రకారం 283 పోస్టులు వికలాంగులతో భర్తీ చేయాల్సి ఉండగా,138 పోస్టులు శారీరక వికలాంగులు లేరనే కారణంతో భర్తీ చేయడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించడం అంటే వికలాంగులను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. ప్రభుత్వం అనేక మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన చేసిందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఫైనల్ లిస్టో పేర్లు వచ్చినప్పటికి, ఎల్బి స్టేడియంలో ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తూ వికలాంగులకు మాత్రం మొండి చెయ్యి చూపించారాన్నారు. సర్టిఫికెట్ పరిశీలన చేసిన వికలాంగుల అభర్థులకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కోటాలో అర్హత సాధించిన అభర్థుల వైకల్య ధ్రువీకరణ పత్రాలను పరిశీలన వెంటనే పూర్తి చేసి వికలాంగుల అభర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వెంటనే వికలాంగులకు 4శాతం రిజర్వేషన్ స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో భర్తీ చేసి చిత్త శుద్ధి నిరూపించుకోవాలి. డిసెంబర్ 7న ముఖ్యమంత్రి వికలాంగురాలికి ఉద్యోగం ఇస్తూ మొదటి సంతకం చేశామని గొప్పగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు 4శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయలేదో చెప్పాలన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో అర్హత సాధించిన వికలాంగులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. యశోద, నాయకులు గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల కోత రాకుండా చూడాలి



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని వ్యవసాయ రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. శుక్రవారం సొమ్మక్కపేట సొసైటీ కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రౌండ్ స్టాక్‌లలో తేడా ఉండకూడదని సిబ్బందికి సూచించారు. లైసెన్సులు ఉన్న కంపెనీల మందులని రైతులకు విక్రయించాలని సూచించారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఎప్పటికప్పుడు రికార్డులు అప్డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బాల్‌రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నర్సాపూర్

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ పట్టణంలోని స్థానిక బీవీఆర్ ఐ టి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంలను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం బీవీఆర్ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంలను పరిశీలించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం నర్సాపూర్ నియోజకవర్గంలోని బీవీఆర్ ఐటి కళాశాలలో 5 సెగ్మెంట్‌లకు కౌంటింగ్ సెంటర్, ఒక పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సెంటర్‌ను, ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో 2 సెగ్మెంట్‌లకు కౌంటింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేసే దిశగా పరిశీలిస్తున్నామన్నారు. కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తహశీల్దార్ కమలాద్రి కళాశాల మేనేజర్ బాపిరాజు, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ బిక్షపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మెదక్ జిల్లా కార్యదర్శి కె. మల్లేశం



నవతెలంగాణ-మెదక్

గ్రామీణ వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని గ్రామీణ వ్యవసాయ కార్మికులకు బడ్జెట్ కేటాయింపులో సవతి తల్లి ప్రేమ చూపించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం ఆరోపించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావాలని గ్రామీణ ఉపాధి హామీ పనులను పట్టణ ప్రాంతాల విస్తరణకు వంద రోజుల పనిని రెండు వందల రోజులకు పెంచి రోజు కూలి రూ. 600 ఇవ్వడం కోసం అదనపు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రతిపాదించిన సీతారామన్ రైతులకు పేదల పెన్షన్లు, రేషన్ షాపుల కిచ్చి సబ్సిడీ ఆహార ధాన్యాలను 8 శాతం తగ్గించడం సిగ్గుచేటని విమర్శించారు. పెరుగుతున్న ధరలను నియంత్రణ చేయకుండా ఏ విధంగా ఆర్థిక సామాజిక అసమానతులను రూపుమాపుతారో వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు ఉచిత విద్య, వైద్యం మెరుగుపరచడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు విస్తరింపజేయాలని ప్రతిపాదనను ఆర్థిక శాఖ మంత్రి పట్టించుకోకపోవడంలో అర్థం లేదన్నారు. ప్రైవేటు విద్యా, ఉపాధి రంగాలలో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు అమలు చేయకుండా సామాజిక అసమానతులను ఏవిధంగా తగ్గించడానికి అవకాశం ఉందో దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. ప్రతి పేదవాని అకౌంట్‌లో రూ. 15 లక్షలను వేస్తామని, విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు వచ్చిందనేది ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బీజేపీ మోసపూరిత విధానాలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సత్యం, వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ లచ్చ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని సన్మానించిన ఉపాధ్యాయులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగిసినందున శుక్రవారం పెద్ద చింతకుంట పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, మాజీ ఉపసర్పంచ్ కడారి నాగరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్, మాజీ వార్డు సభ్యులు వాణి , అంజమ్మ, నీల, మల్లేష్ గౌడ్, ప్రసాద్, దుర్గేష్, మాజీ పాఠశాల చైర్మన్ పావని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన స్పెషల్ ఆఫీసర్లు



నవతెలంగాణ-మనోహరాబాద్: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్లు బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్‌ల పదవి కాలం జనవరి 31తో పూర్తి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల పాలనకు ఆదేశాలు జారీ చేసింది. దాంతో శుక్రవారం తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోని 31 గ్రామ పంచాయతీలలో స్పెషల్ ఆఫీసర్లు బాధ్యతలను చేపట్టారు. మండలాల వారిగా తూప్రాన్ మండలంలోని 14 పంచాయతీలలోని అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఘనపూర్‌లో తహశీల్దార్ విజయలక్ష్మి, యావాపూర్‌లో ఎంపీడీవో అరుంధతి, నాగులపల్లిలో ఎంపీవో కృష్ణవేణి, ఇస్లాంపూర్‌లో అసిస్టెంట్ వెటర్నరి డాక్టర్ లింగమూర్తి, వెంకటాయిపల్లిలో తహశీల్దార్ విజయలక్ష్మి, గుండ్రెడ్డిపల్లిలో ఎంపీడీవో అరుంధతి, మల్కాపూర్‌లో వ్యవసాయ అధికారి గంగమల్లు, కిష్టాపూర్‌లో డిప్యూటీ తహశీల్దార్ ప్రభుదాస్, నర్సంపల్లిలో వ్యవసాయ అధికారి గంగమల్లు, ఇమాంపూర్‌లో డిప్యూటీ ఆర్డీవో కార్యాలయం శ్రీకాంత్, వెంకటరత్నాపూర్‌లో ఏఈ పంచాయత్ రాజ్ మధుసూధన్, కోనాయిపల్లి (పిబి)లో ఏఈ పంచాయత్ రాజ్ మధుసూధన్, దాతర్‌పల్లిలో ఎంపీవో కృష్ణవేణి, వట్టూర్‌లో డిప్యూటీ తహశీల్దార్ ప్రభుదాస్‌లు బాధ్యతలు చేపట్టారు.

మనోహరాబాద్‌లో..

మనోహరాబాద్ మండలంలోని 17 గ్రామపంచాయతీలలో కూడా స్పెషల్ ఆఫీసర్లు బాధ్యతలను చేపట్టారు. మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కాళ్లకల్‌లో ఎంపీవో సతీష్‌కుమార్, మనోహరాబాద్‌లో తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, కూచారంలో ఎంపీడీవో యాదగిరిరెడ్డి, జీడిపల్లిలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా పర్కిబండలో డిప్యూటీ తహశీల్దార్ కౌషిక, లింగారెడ్డిపేటలో ఏఈ మిషన్ భగీరథ దివ్య, రంగాయిపల్లిలో ఏఈ మిషన్ భగీరథ దివ్య, కోనాయిపల్లి (పీటీ)లో డాక్టర్ వెటర్నరి రామలక్ష్మి, ముప్పిరెడ్డిపల్లిలో వ్యవసాయ అధికారి స్రవంతి, వెంకటాపూర్ అగ్రహారంలో ఏఈ ఇరిగేషన్ అనురాధలు బాధ్యతలు చేపట్టారు. పోతారంలో ఏఈ ఇరిగేషన్ అనురాధ, రామాయిపల్లిలో డాక్టర్ వెటర్నరి రామలక్ష్మి, దండుపల్లిలో వ్యవసాయ అధికారి స్రవంతి, పాలాటలో ఎంపీవో సతీష్‌కుమార్, చెట్లగౌరారంలో ఎంపీడీవో యాదగిరిరెడ్డి, కొండాపూర్‌లో తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, గౌతోజిగూడలో డిప్యూటీ తహశీల్దార్ కౌషికలు బాధ్యతలు చేపట్టారు. వారికి మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యదర్శులు శాలువాలు కప్పి బాధ్యతలను అప్పగించారు.

స్పెషల్ ఆఫీసర్ల బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-కౌడిపల్లి

స్పెషల్ ఆఫీసర్లుగా మండల అధికారులు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపూర్, వెంకటరావుపేట్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా ఇరిగేషన్ డీఈ ఈ జగన్నాథం ఎంపీడీవో శ్రీనివాస్, కొట్టాల, కుకుట్లపల్లి బాధ్యత స్వీకరించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డిఈ ఈ జగన్నాథం మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్‌లకు ఎలా సహకరించారో అధికారులకు కూడా అలాగే సహకరించాలని ఆయన గ్రామస్తులను కోరారు. ప్రభుత్వం నుంచి పంచాయతీ ఏ నిధులు వచ్చినా సక్రమంగా ఖర్చు చేసి గ్రామాల అభివృద్ధికి సహకరిస్తామని ఆయన తెలిపారు. గ్రామంలో మంచినీటి కొరత వీధిదీపాలు మురికి కాలువల శుభ్రత సమస్యలు రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి సుజాత, సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మెకు సహకరించాలి

- మున్సిపల్ కమీషనర్‌కు సమ్మె నోటీస్



నవతెలంగాణ-మెదక్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌కు సహకరించాలని సీఐటియు జిల్లా కార్యదర్శి బి. బసవరాజు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని మున్సిపల్ కమీషనర్‌కు సీఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమ్మెలో మున్సిపల్, ఉద్యోగ కార్మికులు పాల్గొంటారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో భాగమైన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల అభివృద్ధికి బడ్జెట్ పెంచాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ విధానం రద్దు చేయాలన్నారు. మున్సిపల్ సిబ్బంది అందర్నీ పర్మినెంట్ చేయాలన్నారు. పరిశుద్ధ కార్మికుల ప్రైవేటీకరణ నిలిపివేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలని కోరుతూ జాతీయ సమ్మెలో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికులందరికీ ప్రాధాన్యతనిచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. పార్టీలో కార్మికుల పిల్లలకు ప్రత్యేక స్కాలర్ షిప్‌లు, చదువులకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. ఆదివారాలు, పండుగ సెలవులు, ఎనిమిది గంటల పని దినాన్ని మాత్రమే అమలు చేయాలన్నారు. వాటర్ వర్క్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. రాంకీ, తదితర ప్రైవేట్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీలకు ప్రత్యేక అధికారుల నియామకం



నవతెలంగాణ-నార్సింగి: గత సర్పంచుల పదవీ కాలం పూర్తి అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిలో సర్పంచ్ ఎన్నికలు జరిపేందుకు సుముఖంగా లేనందున, గ్రామ పంచాయితీ కార్యకలాపాలకు ప్రత్యేక అధికారుల ద్వారా కొనసాగించాలన్న ఆలోచనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయితీలకు కూడా ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి నార్సింగి గ్రామ పంచాయితీ, సంఖాపూర్ తాండా పంచాయితీలకు ఎంపీఓ నరేష్ కుమార్, ఎంపిడిఓ ఆనంద మేరీకు జప్తి శివనూర్ ప్రత్యేక అధికారిగా నియమించగా, తహసీల్దార్ షేక్ కరీంకు వల్లూరు, పెద్ద తాండా లకు, మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరికు శేరిపల్లి, నర్సంపల్లి, ఏఈ (ఆర్డబ్లుఎస్) స్వప్నకు భీం రావు పల్లి, సంఖాపూర్ గ్రామాలను కేటాయించారు. సర్పంచుల పాలనలో మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు జరగగా, వాటికి సంబంధించిన బిల్లులు పూర్తిగా చెల్లింపులు జరగ లేదు. ప్రత్యేక అధికారుల పాలనలోనైనా తమ బిల్లుల చెల్లింపులు జరుగుతాయని సర్పంచులు, గుత్తేదారులు ఆశల తో ఎదురు చూస్తున్నారు.

ప్రజల శ్రేయస్సు కొరకే తపాలా శాఖ సేవలు

- సంగారెడ్డి సబ్ డివిజన్ తపాలా శాఖ మెయిల్ ఓవర్సీర్ డి.శ్రీనివాస్



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ప్రజల శ్రేయస్సు కొరకే తపాలా శాఖ సేవలు అందిస్తుందని సంగారెడ్డి సబ్ డివిజన్ తపాలా శాఖ మెయిల్ ఓవర్సీర్ డి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేటలోని తపాలా శాఖ కార్యాలయంలో పెద్ద శంకరంపేట సబ్ ఆఫీస్ కు వచ్చిన ఖాతాదారులకు లాభాదాయకమైన పోస్టల్ పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ , రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి భీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తపాలా శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో తపాల శాఖ జీవిత బీమా పాలసీలను పెంచేందుకు బీపీఎంలు తపాలా శాఖ సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. జీవిత బీమా పాలసీ వివరాలను అందరికీ తెలియజేసి ఎక్కువమంది జీవిత బీమా చేసేలా చూడాలన్నారు. ఈ మేరకు పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్పి ఎం రఘు.. బీపీఎం ప్రశాంత్, గంగారాం, మానయ్య సిబ్బంది తుకారం, సుదర్శన్,సవిత తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పర్ర ప్రభాకర్



నవతెలంగాణ-కొల్చారం

పొట్ట కూటికోసం శిఖంలో సాగుచేసుకుంటున్న దళితులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పర్ర ప్రభాకర్ అన్నారు. మండలంలోని సంగాయిపేట అంబేద్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగాయిపేట పెద్ద చెరువు శిఖం భూమిలో గ్రామానికి చెందిన కొందరు నిరుపేద దళితులు గత ఐదు సంవత్సరాలుగా చెరువులో నీరు అడుగంటిన సమయంలో పంటలు సాగుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు కావాలని దళితులను పంటలు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన వారి బంధువులు చెరువు శిఖం భూమిలో పంటలు సాగు చేస్తున్న వారిని ఏమనకుండా గ్రామానికి చెందిన దళితులపై కావాలని కొంతమంది అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. భూమి లేని నిరుపేద దళితులు పంటలు సాగు చేస్తే అడ్డుకోవడం, నీటిని తొలగించడం లాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మయ్య మహేష్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో

నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలో ఉన్న శేరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి (డీ.ఈ.ఓ) రాధాకృష్ణ సందర్శించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. చదువులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి అన్ని విధాలుగా సహకరించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాధాకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-గజ్వేల్



టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్రం, రాజులు అన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఖమ్మం పట్టణంలో నిర్వహించే మహాసభలకు సంబంధించి గోడపత్రికను గజ్వేల్ మండలం కొడకండ్ల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా పిఆర్సి అమలు చేయాలని, బదిలీలు పదోన్నతులు చేపట్టాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు పాపిరెడ్డి, నాగరాజు గౌడ్, మోహన్ రావు, వేణు, శ్రీనివాస్ గౌడ్, మీనయ్య, పెంటయ్య, అర్జున్, వనజ, శ్రీలక్ష్మి, దుర్గా శ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన జెడ్పీ సీఈవో

• పోతారంలో ఉపాధి హామీ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం జెడ్పి సీఈవో రమేష్ పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న లెవెలింగ్ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీల సమక్షంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం 18వ అవిర్భవ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. పని చేస్తున్న కూలీలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ వీరభద్రయ్య, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎల్లయ, టీఏ పరుశురాములు, వెంకటేష్ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలిచ్చిన గౌరవాన్ని మరువలేం

• సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా శర్మ





నవతెలంగాణ -గజ్వేల్

ప్రజలు ఇచ్చిన గౌరవాన్ని మరువలేమని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో గజ్వేల్ జెడ్పిటిసి పంగా మల్లేశం ఆధ్వర్యంలో గజ్వేల్ మండల సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించామని అదే ప్రజలు ఇచ్చిన గౌరవమని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు నేతృతంలో గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేదని ఎవరు బాధపడవద్దన్నారు. సర్పంచుల పదవీకాలం అయిపోయినంత మాత్రాన ప్రజాసేవకు దూరంగా ఉండొద్దని ప్రజలు తమ కష్టసుఖాలు చెప్పుకునేందుకు ఇంటికొస్తారని వారి సమస్యలను సాధ్యమైన వరకు పెద్దల దృష్టికి తీసుకుపోదామన్నారు. అనంతరం మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు ప్రజా సేవ చేశామని, సర్పంచులకు తృప్తి ఇచ్చిందని భవిష్యత్తులో రిజర్వేషన్లు యధా విధంగా ఉంటే మళ్ళీ ప్రజాసేవకు ముందుకు రావాలన్నారు. గజ్వేల్ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పెద్దలే ఉన్నారు కాబట్టి భవిష్యత్తులో జరిగే సర్పంచి ఇతర ఎన్నికల్లో తోడ్పాటు అందిస్తారని ఆయన అన్నారు. సర్పంచుల కాలంలో జరిగిన అభివృద్ధి పనులు కరపత్ర రూపంలో ఇంటింటికి పంచుకొని అభివృద్ధిని వివరించాలన్నారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. జెడ్పిటిసి పంగ మల్లేశం మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన జడ్పిటిసి ఎన్నికల్లో తనకు ఎంతో సర్పంచులు సహకరించినట్లు ఆయన గుర్తు చేశారు. సర్పంచులను సన్మానించి మెమోంటోలు అందించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాస శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు చెరుకు చంద్రమోహన్ రెడ్డి, రైతు సమితి నాయకులు మద్దూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలే టార్గెట్

• 1991 నుంచి నేటి వరకు







నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ స్కూల్లో జిడిఆర్, సాయి జి.డి.ఆర్ ప్రత్యేకంగా విద్యార్థులపై దృష్టి పెడుతున్నారు. 10వ తరగతి విద్యార్థులపై శ్రద్ధ చూపుతూ శత శాతం ఫలితాలే టార్గెట్‌గా విద్యాభ్యాసాన్ని అందిస్తున్నారు. ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలో జిడిఆర్, సాయి జిడిఆర్ ప్రత్యేకంగా ఉంటుందని చెప్పాలి. పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ పదవ తరగతి విద్యార్థులను మెరుగుపరిచేందుకు పాఠశాల యజమాన్యం పగడ్బందీ నిర్ణయాలను తీసుకుంటుంది. 1991లో గజ్వేల్ లో ప్రారంభించిన జి.డి.ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల గజ్వేల్ తాలూకా పరిధిలో అన్ని తరగతులలో మంచి ఫలితాలు సాధిస్తుందని, మంచి ఉపాధ్యాయులను ఎంచుకొని విద్యాభ్యాసం అందిస్తుందని పేరుగాంచింది. జిడిఆర్ పాఠశాలలో చదివిన చాలామంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పాలి. ఆ తర్వాత 2014లో సాయి జి.డి.ఆర్ పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాల కూడా మంచి విద్యా ఫలితాలను అందిస్తుంది. ప్రతి సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్ నిర్వహిస్తూ శత శాతం ఫలితాలు వచ్చే విధంగా విద్యార్థులకు విద్యాభ్యాసాన్ని అందిస్తున్నారు. సాయి జిడిఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించిన రోజు నుండే తమ పిల్లలగా భావించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సాయి జిడిఆర్ ఇంగ్లీష్ మీడియంలో ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థులు 53 మంది ఉండగా ఏడుగురు టీచర్లను నియమించి విద్యార్థులు శత శాతం ఫలితాలు సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత సంవత్సరంలో సాయి జీడిఆర్ ఇంగ్లీష్ మీడియంలో శత శాతం ఫలితాలు సాధించింది. 2023-24 పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సర్వం సిద్ధం చేస్తున్నారు. ఉదయం సాయంత్రం స్లిప్ టెస్టులు పెడుతూ, వారిని మెరుగైన విద్యార్థిని విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలలో బాల బాలికలకు వేరువేరుగా మౌలిక సదుపాయాలు, విశాలమైన తరగతి గదులు ఉన్నాయి. చదువుతోపాటు క్రీడారంగంలో కూడా సాయి జిడిఆర్ రాణిస్తుందని చెప్పాలి.

ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ

గజ్వేల్ పట్టణంలో ఇంగ్లీష్ మీడియంలో సాయి జిడిఆర్ ఇంగ్లీష్ మీడియం పట్ల గజ్వేల్ తాలుకలో విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా ఫలితాలపై మంచి నమ్మకం ఉంటుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ప్రతి ఏటా శత శాతం సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. విద్యార్థులు సైతం పరీక్షల సమయంలో కఠినంగా ఉంటూ చదువుతున్నారు. స్లిప్స్ టెస్టుతో విద్యార్థి టాలెంట్ కోసం ప్రయత్నం చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద తగిన సమయం ఇచ్చి విద్యార్థుల పనితీరు గమనించాలని న హ చి న స్త న్నా వ ు న్నా ర ు. విద్యార్థులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.



ప్రిన్సిపాల్ సోమేశ్వర్ రెడ్డి

హల్దీ వాగులోకి నీళ్లను వెంటనే విడుదల చేయాలి

• రైతుల పంటల సాగుకు సహకరించాలి
• మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్

హల్ది వాగులోకి నీళ్లను వెంటనే విడుదల చేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సంగారెడ్డి కెనాల్ ద్వారా హల్దీ వాగులోకి నీళ్లను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతుల తరపున డిమాండ్ చేశారు. హల్ది వాగుపై 45 వరకు గత కేసీఆర్ ప్రభుత్వం చెక్ డ్యామ్‌లు నిర్మాణం చేసిందన్నారు. హల్దీ వాగు నుంచి నేరుగా నీళ్ళు నిజాంసాగర్లోకి వెళ్తాయన్నారు. నీళ్ల వదలడం ద్వారా వాగుకు ఇరువైపులు ఉన్న పొలాలను రైతులు సాగు చేసుకుంటారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు సాగునీరును వదిలలేదన్నారు. ఎండాకాలం వచ్చింది రైతులు నాట్లు వేసుకున్నారన్నారు. రైతుల పొలాలు ఎండిపోయే అవకాశం ఏర్పడుతుందన్నారు. రైతులకు సాగునీరు అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే హల్దీ వాగులోకి నీళ్లను వదిలే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. హల్ది వాగును కూడవెల్లి వాగును జీవనదులుగా మార్చిన ఘనత కేసిఆర్‌కే సాధ్యమైందన్నారు. రైతుల సమస్యలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి భరోసాగా నిలుస్తుంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అయోమయానికి గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేయాలని ఆయన కోరారు.



అంబేద్కర్ ఆశయాలను సాధించాలి

• అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు. మండలంలోని మర్మముల గ్రామంలో మలిపెద్ది సత్తయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మలిపెద్ది మల్లేశం ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనంతరం వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో సేవ చేశారని, భారత రాజ్యాంగాన్ని రాసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే ప్రతి ఒక్కరు పదవులను అనుభవిస్తున్నామన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన మలిపెద్ది మల్లేశంను ఆయన అభినందించారు. బిఆర్ఎస్ మద్దూరు, దూల్మిట్ట, మండల అధ్యక్షులు మేక సంతోష్ కుమార్, మంద యాదగిరి, దూల్మిట్ట సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు చొప్పరి వరలక్ష్మి సాగర్, మాజీ సర్పంచ్‌లు సుందర గిరి స్రవంతి పరశురాములు గౌడు, బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, కోఆప్షన్ మెంబర్ ఎండి జిలాని, మాల మహానాడు మండల అధ్యక్షుడు బొప్ప నాగయ్య, అంబేద్కర్ యువజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

గణితంను ఇష్టంతో చదవాలి

నవతెలంగాణ-నంగునూరు



గణితంను కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మెలకువలు నేర్చుకోవాలని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు. శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రామస్వామి, గణిత ఫోరం మండల శాఖ అధ్యక్షులు ఏ.సత్యనారాయణ ఆధ్వర్యంలో విడుదల చేశారు. తెలంగాణ గణిత ఫోరం నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంను నిరంతరం అభ్యసనం చేస్తూ వేగము, ఖచ్చితత్వాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. టాలెంట్ టెస్ట్ రాయడం వల్ల మేథో జ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు వంశీ, రాజు, బాల ఆంజనేయులు, దత్తాత్రేయ, రమణారెడ్డి, యుగంధర్ రావు, హమ్మద్, అంబిక, సంగీత,స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు రాజి రెడ్డి, నగేష్, కన్యాలాల్, రాజు తదితరులు పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో కె. కృషిత ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ నంగునూరు, ఆర్. శృతి బి. అవినాష్ రెడ్డి లు ద్వితీయ స్థానం జడ్పీహెచ్ఎస్ నర్మెట, తెలుగు మీడియంలో జి. అఖిల ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ నర్మెట, ద్వితీయ స్థానం శివకుమార్ జడ్పీహెచ్ఎస్ నర్మెట, బిందుశ్రీ, సాగర్‌లు ద్వితీయ స్థానం జడ్పీహెచ్ఎస్ గట్ల మల్యాలలు విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు ప్రధానం చేశారు. వీరు జిల్లాస్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌కి ఎంపికైనారు.

ప్రమాదాల నివారణ పిచ్చిమొక్కల తొలగింపు

నవతెలంగాణ-మద్దూరు



జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మద్దూరు మండల కేంద్రంలో ఎస్సై షేక్ యూనిస్ అహ్మద్ అలీ, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్‌ల ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి లద్నూర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. విపరీతంగా పిచ్చి మొక్కలు పెరగడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు జేసీబీ, డోజర్ సాయంతో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, ధర్మారం మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకం

• డీఆర్‌డీఏ పీడీ జయదేవ్



నవతెలంగాణ-కొండపాక

గ్రామాభివృద్ధిలో పంచాయితీల పాత్ర కీలకమని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ అన్నారు. ప్రత్యేక అధికారుల పాలన సందర్భంగా కొండపాకలో పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. కనీస వసతులైన తాగునీరు, విద్యుత్ దీపాలతో పాటు నర్సరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పనుల మస్టర్ తప్పకుండా ఉండాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో జిల్లాలో కొండపాక మండలం రెండో స్థానంలో ఉందన్నారు. కూలీలకు కనీస వసతులు నీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచడం, కూలీలకు చిన్న పిల్లలు ఉంటే వారి ఆలనా పాలనకు ఆయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 269 రకాల పనులే కాకుండా స్థానికంగా అవసరమున్న పనులను కూడా చేపట్టవచ్చన్నారు. గ్రామాల్లో యువతను క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా ప్రోత్సహించాలని సూచించాడు. కష్టపడి పని చేసే తత్వం వారికి కలిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, కొండపాక, కుకునూరు పల్లి స్పెషల్ ఆఫీసర్లు అమీనా, నాగేందర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ భూపతి, పిఆర్ ఏఈ తిరుపతిరెడ్డి పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వివాహితను వేధించిన విలేకరికి దేహశుద్ది

నవతెలంగాణ-చేర్యాల: చేర్యాల పట్టణంలో ఓ వివాహితను ఒక వార్తా దిన పత్రికకు చెందిన విలేకరి వేదించడంతో వివాహిత కుటుంబ సభ్యులు ఆ వ్యక్తికి గురువారం దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్ లో అప్పగించగా పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా వివాహితకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు తన దగ్గర ఉన్నాయని ఫోన్ చేసి వేధించడంతో బాధిత మహిళా తన కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆ విలేఖరికి దేహశుద్ధి చేశారు. ఈ విషయంలో ఆ విలేకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు జనవిజ్ఞాన వేదిక జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రజ్ఞాపూర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 3వ తేదిన ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జెవివి జిల్లా అధ్యక్షులు మొలుగు బాలరాజు, ప్రధాన కార్యదర్శి తుమ్మ సత్యం తెలిపారు. టాలెంట్ టెస్ట్ పోస్టర్లను సిద్దిపేటలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పాఠశాలల విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో రావాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు పదివేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ రాశారని తెలిపారు. జిల్లాస్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాల వారిగా రాష్ట్రస్థాయికి ఎన్నిక కాబడతారని తెలిపారు. ఈ నెల 9,10, 11 న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా కమిటీ సభ్యులు ఎండి.సాదత్ అలీ, రాజమౌళి, సురేందర్ రెడ్డి, రాజేందర్, నర్సింగారావులు పాల్గొన్నారు.

ఘనంగా రజక ఆరాధ్య దైవం మాడేలేశ్వర జన్మదిన వేడుకలు.

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



రజకుల ఆరాధ్య దైవం మాడేలేశ్వర స్వామి జన్మదిన వేడుకలు ప్రజ్ఞాపూర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయం వద్ద సంఘం అధ్యక్షులు మెతుకు నర్సింలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు పూజించాల్సిన దైవం మాడేలేశ్వర స్వామి అన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా అందరి కుటుంబాలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు మెతుకు బాలమల్లు, రాములు (ఆర్పిఎల్), రాములు (ఆర్టీసీ), బాలయ్య, బాలనర్సు, గౌరవ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, క్యాషియర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దుర్గయ్య కార్యదర్శి దశరథం, కార్యవర్గ సభ్యులు కనకయ్య ఉపేందర్, సాయిబాబా, చంద్రం, కుమార్, ఎం కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను అప్ గ్రేడ్ చేయాలి

• టీపీవీ జేఏసీ చైర్మన్ మేకల అక్షయ్ కుమార్.

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. 1988లో ఏర్పాటు చేసిన గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాల అనేకమంది ఇంజనీర్లను తయారు చేసి రాష్ట్రానికి అందించిందన్నారు. రాష్ట్రంలోనే ఏకైక ఎస్సీ బాలుర ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల గజ్వేల్‌లో ఉండడం ఇక్కడ ప్రాంతం విద్యార్థులు చేసుకున్న అదృష్టమన్నారు. ప్రభుత్వ ఇంజనీర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో ఉన్న కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీర్ కళాశాలగా అప్డేట్ చేస్తూ అనుమతి ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. అడ్మిషన్లు కూడా 2024-25 విద్యా సంవత్సరానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఉండడంతో ప్రత్యేక చొరవ చూపాలని ఆయన కోరారు. గజ్వేల్ ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలను కూడా ప్రభుత్వ ఇంజనీర్ కళాశాలగా అప్డేట్ చేయించుకున్నందుకు తగిన కృషి జరగాలని ఆయన కోరారు.

గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా చూడాలి

• జెడ్పి సీఈవో రమేష్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



గ్రామాలలో గ్రామపంచాయతీ పాలకవర్గం లేనందున ప్రత్యేక అధికారులే అన్ని తామై సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సిద్దిపేట జెడ్పి సీఈవో రమేష్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులకు గ్రామాలలో చేపట్టబోయే పనులపై అవగాహన కల్పించారు. గ్రామసభలు, బిల్లుల వసూలు చెల్లింపులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాలలో పనుల తీరు పర్యవేక్షణ, లైటింగ్, శానిటేషన్ సరిగ్గా చూసుకోవాలన్నారు. సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారులు ప్రతి పనిలో ముందుండి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవీందర్ రెడ్డి, డిఎల్ పిఓ వీరభద్రం, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-మద్దూరు



వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రామకృష్ణ రైతులను కోరారు. శుక్రవారం దూల్మిట్ట మండలంలోని కొండాపూర్, కూటిగల్ గ్రామాలలో రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి చేనులో కాండం తొలుచు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరి చేనుకు మొగి పురుగు కొట్టగానే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనూష తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేకాధికారుల పాలనపై అవగహన

నవతెలంగాణ-మర్కుక్



గ్రామాల్లో ప్రధానంగా పారిశుధ్య, తాగునీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పూర్తిగా పర్యవేక్షించాలని, పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగించాలని మండల ప్రత్యేకాధికారి కౌసల్యాదేవి సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్ ఎంపిడివో కార్యాలయంలో ఎంపీడివోతో కలసి అమె గ్రామ ప్రత్యేక ఆధికారులకు పరిపాలనపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలనపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకాధికారులకు పూర్తి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు తహశీల్దారు చంద్రశేఖర్ రావు, ఎంపీవో రాజలింగం, ఎవో నాగేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ అభిలాష్, ఉప తహశీల్దారు భాగ్య రేఖ, ఐసిడిఎస్ సూపర్ వేజర్ దేబేరా రాణి,వివిధ గ్రామాల పంచాయతి కార్యదర్శులు, తదితరులున్నారు.

గ్రామపంచాయతీలలో బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-నంగునూరు



మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం గ్రామపంచా యతీలలో ప్రత్యేక అధికారులు బాధ్య తలు స్వీకరించారు. ప్రత్యేక అధికారులను పంచాయతీ కార్యదర్శులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు స్వాగ తం పలికారు. ఒక్కో గ్రామానికి ఒక్కో ప్రత్యేక అధికారిని నియమిస్తామంటూ చెప్పిన మాటలు నీటి మూటలు లాగా ఉందంటూ చర్చించుకుంటున్నారు. ఒక్కో ప్రత్యేక అధికారికి రెండు గ్రామాల చొప్పున కేటాయించారు. నంగునూరు ఎంపీడీవో పోస్ట్ ఖాళీగా ఉండడంతో ఎంపీఓగా ఉన్న వేణుగోపాల్ ఇంచార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వేణుగోపాల్‌కు నాలుగు గ్రామాల ప్రత్యేక అధికారిగా ఆదేశాలు జారీ అయ్యాయి. నెలల తరబడి ఎంపీడీవో పోస్ట్ ఖాళీగా ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయంటూ మండలానికి చెందిన అధికారులు వెల్లడించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ పథకానికి చెందిన ఏఈలు, ఎడీఏ సిద్దిపేట, మండల వ్యవసాయ అధికారి, విద్యాధికారి, ఇంచార్జ్ ఎంపీడీవో, సూపరింటెంట్, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్‌లను ప్రత్యేక అధికారులుగా కేటాయించారు.

కొలుగురు స్పెషల్ ఆఫీసర్‌గా సుమలత



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం కొల్గుర్ గ్రామ నూతన ఇన్చార్జిగా పదవి బాధ్యతలు స్వీకరించిన సుమలతను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గారి బైరయ్య, సాయగౌని నర్సింలు, జీడిపల్లి చంద్రారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ మల్లం రాజు, ఉప సర్పంచ్ గొల్ల స్వామి, పంచాయతీరాజ్ సెక్రెటరీ సంధ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో కట్టుదిట్టమైన భద్రత

- హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

వ్యాపారస్తులు, కిరాణా దుకాణం యజమానులు తమ షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో కిరాణా షాప్ యజమానులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సరైన భద్రత చర్యలు పాటించని యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఏదైనా నేరం జరిగితే నేరస్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ప్రత్యక్ష సాక్షులుగా ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా ఇంటి యజమానులు కూడా సీసీ కెమెరాలు పెట్టుకుంటే భద్రతపరంగా బాగుంటుందని సూచించారు.

అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

- దుబ్బాక సీఐ శ్రీనివాస్



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఫోన్ ఓటిపి నెంబర్ అడిగితే చెప్పవద్దని, వారు పంపించిన ఫోన్ లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీసు వ్యవస్థ నిరంతరం కృషి చేస్తుందని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పోలీసులకు తెలియజేయునన్నారు.

మా పొట్ట కొట్టొద్దు....

- ఆధార్ అనుసంధానంతో 'ఉపాధి'కి దూరం
- 428 మంది కూలీలపై ప్రభావం
- కేంద్ర నిబంధనల ఫలితంగా కష్టాల్లో నిరుపేద కూలీలు
- ఆధార్ అనుసంధాన ప్రక్రియ ముగియడంతో ఆవేదన
- నష్టనివారణ చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ





నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల వ్యాప్తంగా 26 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 9381 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా 18997 మంది కూలీలు ఉన్నారు. ఇందులో 6408 యాక్టివ్ జాబ్కార్డుల్లో 11814 మంది కూలీలు క్రమం తప్పకుండా ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా అమలు చేస్తున్న నిబంధనలు కూలీల పాలిట శాపంగా మారుతున్నాయి. ఉపాధి కూలీలు తమ జాబ్‌కార్డులను ఆధార్‌కు లింక్ చేసుకోవాలనే నిబంధన కారణంగా 428 మంది కూలీలు ఉపాధికి దూరమయ్యే ప్రమాదం ఉంది. గతంలో ప్రతి జీపీలో యేటా 20కి మించి పనులు చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కూలీలకు పనులు దొరకడం లేదు. ప్రస్తుతం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలనే ఆదేశాలు ఉండడంతో కూలీలు మరింత నష్టపోనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తమ పొట్ట గొట్టే విధంగా ఉన్నాయని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

428 మంది కూలీలపై ప్రభావం

దౌల్తాబాద్ మండలలోని ఆధార్ అనుసంధాన విధానం 428 మంది కూలీలపై ప్రభావం చూపనుంది. 11814 మంది రెగ్యూలర్‌గా పనులకు వెళ్లే కూలీలు ఉండగా వీరిలో 11386 కూలీల జాబ్‌కార్డులు ఆధార్‌తో అనుసంధానం అయినవి. ఉపాధి హామీల పథకంలో పనిచేసే కూలీలు వారి వేతనాలను పొందడానికి కేంద్ర ప్రభుత్వం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానంలో భాగంగా సిబ్బంది గ్రామాల్లోని తమ పరిధిలో పనులు చేసే కూలీల జాబ్‌కార్డులను ఆధార్ అనుసంధానం చేయాలి. దానిని కూలీలు తమ బ్యాంకు, పోస్టాఫీసు బ్యాంకు ఖాతాలకు లింక్ చేసుకోవాలి. ఈ ప్రక్రియకు డిసెంబరు 31, 2023వ తేదితో గడువు ముగిసింది. ఆధార్‌కు అనుసంధానించిన జాబ్‌కార్డులు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆమోదం పొందిన తర్వాత కూలీలకు వేతనాలు వారి బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాల్లో జమ అవుతాయి. ఇలా ఆమోదం లభించనవి వారు మండలంలో 428 మంది కూలీలు ఉన్నారు. ఆధార్ అనుసంధానం గడువు ముగియడంతో తాము ఉపాధి నష్టపోవాల్సి వస్తున్నదని కూలీలు వాపోతున్నారు. అనుసంధానం కానీ వారు కూలీలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ అధికారులు అంటున్నారు.

వైన్స్‌లపై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

నియమ నిబంధనలను తుంగలోకి తొక్కి ఇష్టా రీతిగా వ్యవహరిస్తున్న సిద్దిపేటలోని రెండు వైన్స్‌లపై ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కోరారు. రాజీవ్ రహదారి పొన్నాల వద్దనున్న వైన్స్‌లో మద్యం తాగి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదానికి ఒక వ్యక్తి గురై చనిపోయాడన్నారు. రాజీవ్ రహదారికి 500 మీటర్ల లోపు ఉండాల్సిన వైన్స్‌ను ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలోని మెదక్ రోడ్‌లో గల ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల ఎదురుగా వైన్స్ ఏర్పాటుకు అధికారులు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు భారీ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. పాఠశాల, కళాశాలకు ఎదురుగా ఉండడంతో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు మత్తుకు బానిసలవుతున్నారన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. వారి నిర్లక్ష్యాన్ని స్థానిక మంత్రుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, సంతోష్ గౌడ్, నజ్జు, ఇమ్రాన్, నవాజ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు గ్రామ ప్రజలకు రుణపడి ఉంటా



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు గ్రామ ప్రజలు సర్పంచ్‌గా గెలిపించి, ఐదు సంవత్సరాలు సేవ చేసే భాగ్యాన్ని కల్పించినందుకు గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని మద్దూరు సర్పంచ్ కంఠరెడ్డి జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ స్పెషల్ అధికారి శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఎంపీటీసీ బొప్ప కనకమ్మ నాగయ్య, అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై నమ్మకంతో సర్పంచ్ గా గెలిపించారని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశానన్నారు. గ్రామంలో ప్రతి వాడవాడ సిసి రోడ్లు అండర్ డ్రైనేజ్ పనులను చేసినట్లు ఆయన తెలిపారు. యువత కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్ ఎండి ఆరిఫ్, వార్డు సభ్యులను యుపిఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ఏఎన్ఎం జ్యోతి అంగన్వాడి టీచర్లు భాగ్యమ్మ ,యాకమ్మ, దుర్గలత, మౌనిక, ఆశా కార్యకర్తలు ఎల్లమ్మ, మంజుల, శోభ, సీఏలు, తదితరులు శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయడం పట్ల హర్షం





నవతెలంగాణ-మిరు దొడ్డి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమని టిఏ కొండల్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీలో పని చేసే ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. 18 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కళ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని సంతోషం వ్యక్తం చేశారు. వీధిన పడుతున్న తమ కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచిందని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉపాధి హామీ ఉద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగులు, రమేష్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మద్దెల రాజేశం, కనక రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం పే స్కేల్ అందించిన సందర్భంగా ఉద్యోగులు హర్షం ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎంపీఓ కవి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





నవతెలంగాణ-తొగుట

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ. బి.లింగం తెలిపారు. శుక్రవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో వాహనదారులకు, ప్రజలకు, రోడ్డు భద్రత వారోత్సవాల సంద ర్భంగా మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల గురించి, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపే వాహనదారులకు రకరకాల గిఫ్టులు, శాలువతో సన్మానించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడు తూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం మోటార్ సైకిల్ వాహనదారులకు, ప్రజలకు చుట్టుపక్కల ఉన్న వ్యాపారస్తులకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు గురించి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు, సలహాలు పాటిస్తూ సేఫ్టీగా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. జరిమానా ఫైన్లు వేయడం తమ అభిమతం కాదని ప్రమాదాల నివారణ, రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై మాత్రమే జరిమానాలు విధిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు, వాహన దారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి వాడుకోవాలని మర్కుక్ ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు హెల్మెట్ వాడకంపై మండల పరిధిలోని వరదరాజ పూర్‌లో శుక్రవారం అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది మల్లేశం, తదితరున్నారు.

ఉపాధి హామీ పథకంతో నిరుపేదలకు ఉపాధి

- జిల్లా ఏపిడి, రాయపోల్ ప్రత్యేక అధికారి బాల్ రాజ్



నవతెలంగాణ-రాయపోల్

గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవనోపాధికి తోడ్పాటున అందించాలని ఉద్దేశంతోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా ఏపీడి, రాయపోల్ ప్రత్యేక అధికారి బాల్ రాజ్ అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయపోల్ మండల కేంద్రంలో కూలీలతో అధికారులు కలిసి ఘనంగా ఉపాధి హామీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలి ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంద రోజులు పనులు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య, ఏపీవో రాములు, ఈసి రవీందర్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్, ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గణిత టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత ఫోరం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షను నిర్వహించారు. 30 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. కోహెడ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి జి. పూజిత, రాంచంద్రాపూర్ పాఠశాల నుంచి వై.నవ్య, బి.సునీత, గుండారెడ్డిపల్లి పాఠశాల నుంచి శృతి, కీర్తనలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే తెలుగుమీడియంలో శనిగరం పాఠశాలకు చెందిన ఎస్.లాస్య, జి.హరీష్, ఎస్.రమలు ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదిన సిద్దిపేట జిల్లాలో జరిగే గణిత ప్రతిభా పోటీలలో పాల్గొననున్నట్లు గణిత ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు జి.వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్‌పాల్‌సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమాదేవి, ఇంఛార్జీ ప్రధానోపాధ్యాయులు నగేష్, ఉపాధ్యాయులు పర్శరాములు, శ్రీనివాస్‌రెడ్డి, విజయలక్ష్మి, అబ్దుల్ హమీద్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మోగి పురుగు నివారణ చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కొండపాక

వరి పంటలో సోకుతున్న మోగి పురుగు నివారణ చర్యలు రైతులు తీసుకోవాలని గజ్వేల్ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాల క్షేత్ర పర్యటన చేశారు ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచన చేశారు. పొలాల్లో వరి పంటపై మోగి పురుగు గుర్తించినట్టు తెలిపారు. మోగి పురుగు నివారణకు నివారణకు కార్బోఫ్యూరాన్ వేయాలని తెలిపారు. కొందరు రైతులు వరిలో బయోగులికలు వేస్తున్నారని. ఈ గుళికలు కేవలం పెరుగుదలకు మాత్రమే తోడ్పడతాయిని పేర్కొన్నారు. మోగి పురుగు, ఆకు చుట్టు పురుగు, సుడిదోమపై ఎటువంటి ప్రభావం చూపవన్నారు. మన ప్రాంతంలో ఈ మోగీ పురుగు పెరగడానికి ప్రధాన కారణం రైతులు ఈ గుళికలను 3 జీ గుళికలు, 4 జి గుళికలు, ఫర్టైర గుళికలు అని భావించి వేస్తున్నారని రైతు ఈ గుళికలను వేయరాదని తెలిపాడు. గ్రామాల్లో తిరుగుతూ అమ్ముతున్న వారి వద్ద తీసుకోవద్దని, అలాంటివారు వస్తే అదికారులకు తెలియజేయాలన్నారు. కొండపాక పి ఎస్ సి ఎస్ లో స్టాక్ నిలువలను తనిఖీ చేశారు. ఆయన వెంట మండుల వ్యవసాయ శాఖ అధికారులు ప్రియదర్శిని తదితరులున్నారు.

గణిత ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ మ్యాస్ ఫోరం ఆధ్వర్యంలో చేర్యాల మండలంలోని మోడల్ ఆదర్శ పాఠశాలలో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు మండల అధ్యక్షురాలు పాశికంటి వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ మొగుళ్ళ నరసింహారెడ్డి హాజరై విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధాన చేశారు. ఇంగ్లీష్ మీడియంలో విజేతలుగా పి.సాయిచరన్ (మోడల్ స్కూల్), ఎం.సూర్యకాంత్ (జడ్పీ హెచ్ ఎస్ గుర్జకుంట), పి. భరద్వజ్ (జడ్పీ హెచ్ ఎస్), తెలుగు మీడియంలో కోమల (జడ్పీ హెచ్ ఎస్), కార్తిక్ (జడ్పీ హెచ్ ఎస్ తాడూర్), శిరీష (జడ్పీ హెచ్ ఎస్ అర్జునపట్ల) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గణిత అధ్యాపకులు చంద్రశేఖర్ శర్మ ఉప్పల ప్రభాకర్, మేఘమాల, గంగ ప్రసాద్, సుధీర్, రేఖ, శ్రీనివాస్, రాజయ్య, మాధవి, నిరూపమ, యాకలక్ష్మి పాల్గొన్నారు.

జవాన్ జ్ఞాపకార్థం విగ్రహ ఏర్పాటు



నవతెలంగాణ-దుబ్బాక

ఆర్మీ జవాన్ జ్ఞాపకార్థం అతడు చదువుకున్న దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట ప్రాథమిక పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దుబ్బాక మండల పరిధిలోని బొంగరం లలిత, శ్రీనివాస్ రెడ్డి దంపతుల కుమారుడు మహేందర్ రెడ్డి ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్న సమయంలో అనారోగ్యానికి గురై మరణించాడు. జవాన్ జ్ఞాపకార్థంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని గురువారం 11 వార్డ్ కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జక్క సత్యనారాయణ జవాన్ తల్లిదండ్రులను శాలువా కప్పి సన్మానించారు. ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్, మాధవి, జ్యోతి, నందిని, మాజీ ఎస్ఎంసి వైస్ చైర్మన్ విజయ్ కుమార్, రవికాంత్ పలువున్నారు.

కుకునూరు పల్లిలో గడ్డివాము దగ్ధం





నవతెలంగాణ-కొండపాక: కుకునూరు పల్లికి చెందిన బక్కని యాదగిరి అనే రైతు తన పొలం వద్ద ఉన్న గడ్డివాము ప్రమాదవశాత్తు గురువారం రాత్రి దగ్ధమైంది. సుమారు 200 కట్టల గడ్డిని పశువుల కోసం నిల్వ ఉంచాడు. రాత్రి ప్రమాదవశాత్తు అంటుకోవడాన్ని గమనించిన పెట్రోలింగ్ పోలీసులు ఆయనకు సమాచారం ఇచ్చారు. అలాగే అగ్నిమాపక వాహనాన్ని తెప్పించి ఆర్పించారు. అప్పటికే గడ్డి మొత్తం దగ్ధమైంది. సుమారు 50 వేల నష్టం వాటిల్లిందని బాధితు డు పేర్కొన్నాడు. సహాయం అందించాలని తహసీల్దారుకు విజ్ఞప్తి చేశాడు.

పదవీ కాలం ముగిసిన పాలకవర్గానికి సన్మానం





నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట మండలంలోని రాంరెడ్డి పేట గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి విట్టల్ గ్రామ స్పెషల్ ఆఫీసర్ మిషన్ భగీరథ ఏఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సర్పంచ్ పుట్టి దుర్గవ్వ, ఉపసర్పంచ్ సుశీల, వార్డు సభ్యులు మొగులన్, బాలమణి, విట్టవ్వ, బాలవ్వ, సంగమేశ్వర్, పోగుల అశోక్, విట్టల్, గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్లను గ్రామస్తులు పార్టీలకతీతంగా శాలువాలతో సన్మానించి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ మండల పార్టీ మాట్లాడుతూ గత గడిచిన ఐదు సంవత్సరాలు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. గ్రామానికి సిసి రోడ్లు మురికి కాలువ నిర్మాణం డంపింగ్ యార్డ్ పల్లె ప్రకృతి వనం క్రీడ మైదానంతో పాటు అనేక కార్యక్రమాలు చేపట్టి మాజీ ఎమ్మెల్యే మహ రెడ్డి భూపాల్ రెడ్డి గారి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ తమకు సహకరించిన క్లిష్ట పరిస్థితులలో కష్ట సుఖాలలో వెన్నుదన్నుగా ఉండి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డికి గ్రామ ప్రజలకు వార్డు మెంబర్లకు అధికారులకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సంఘాలు గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ స్పెషల్ ఆఫీసర్ మిషన్ భగీరథ శ్రీకాం త్ను పంచాయతీ కార్యదర్శి విట్టలను గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ వార్డ్ సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామానికి ఎల్లవేళలా పారిశుద్ధ్యంలో త్రాగునీరు పారిశుద్ధ్యం సేవలందించిన గ్రామపంచాయతీ సిబ్బంది సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, తదితరులు ,పాల్గొన్నారు

న్యాల్కల్ : పదవీ కాలం ముగిసిన మండలంలోని హుస్సెల్లి, రామ్ తీర్థం, కల్బేమల్ గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని ఆయా గ్రామస్తులు శాలువా, పూల మాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ.. పదవీలో ఉనప్పుడు చేసిన అభివృద్ధి పనులు ఎల్లకాలం ప్రజలు గుర్తిండిపోతుందన్నారు. సేవ చేసిన వారిని ప్రజలు శాశ్వతంగా గుర్తించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు సుధారాణి వెంకట్ రెడ్డి, మహిపాల్, చంద్రమ్మ, ఉప సర్పంచ్ అశోక్ పాటిల్, నిఖిల్, పంచాయతీ సెక్రటరీలు నాగభూషణం, కృష్ణ ప్రతాప్ రెడ్డి, నర్సింలు, యువ నాయకులు సందీప్, దత్తు, వార్డ్ మెంబర్లు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించుతాం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించుతామని, ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ అవిశ్వాస తీర్మానం కోసం నారాయణఖేడ్ విచ్చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు.బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లు అనుకూల విధానాల అమలు చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, నిత్యవసర సరుకు ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని అన్నారు. కార్పొరేట్ల ఆస్తులు పెరిగాయన్నారు. అన్నం పెట్టే రైతు కార్పొరేటర్ కార్పొరేట్లకు అప్పజెప్పే మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. రైతులకు అనుకూలమైన సబ్సిడీలు రైతులకు రుణమాఫీ చేస్తుందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్, శంకర్ సెట్, నర్సింలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న రామాగౌడ్



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆత్మకూర్ రామా గౌడ్ మెదక్ లోకసభ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ తనకు కేటాయించాలని గురువారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం తాను శ్రమిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అవకాశమిచ్చి మెదక్ ఎంపీ టికెట్ ఇస్తే లోకసభ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తానన్నారు. ఇందులో కాంగ్రెస్ యువ నాయకులు ఆత్మకూరు బాబి పాల్గొన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన తన్వీర్



నవతెలంగాణ-జహీరాబాద్

మాజీ కో-ఆప్షన్స్ సభ్యులు మహమ్మద్ అక్బర్ అత్తమ్మ శుక్రవారం మృతి చెందింది. ఈ విషయం తెల్సుకున్న టీఎస్ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ జహీరాబాద్ పట్టణం లోని వార్డ్ నెంబర్ 23 వతన్ బాగ్‌లో మృతురాలి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ. కార్యక్రమంలో మజర్, మొహమ్మద్ అలీ, కాజా తదితరులు పాల్గొన్నారు .

హైమ్యాక్స్ లైట్స్ ప్రారంభం



నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండల పరిధిలోని కమ్మల్ పల్లి గ్రామంలో జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్ సహకారంతో లక్ష రూపాయల విలువ గల హైమ్యాక్స్ లైట్లను గ్రామ బీఆర్ఎస్ యువ నాయకులు విజయ్ కుమార్ పాటిల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ బీబీ పాటిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఈశ్వరప్ప పాటిల్, పాండు, శివకుమార్ పాటిల్ తదితర గ్రామ యువకులు పాల్గొన్నారు.

వాయిస్ ఫర్ బాయ్స్



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గల గిరిజన గురుకుల పాఠశాల కళాశాల ప్రాంగణంలో వాయిస్ ఫర్ బాయ్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ స్కిల్స్, డొమెస్టిక్ వైలెన్స్ అంశాలపై విద్యార్థులు వైస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ బృందం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకరంగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, గాయత్రి, సాంబయ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల కోసం కృషి చేస్తా



నవతెలంగాణ-న్యాల్కల్

మండలంలోని కల్ బేమల్ గ్రామంలో బిసి, ఎస్సి కాలనీలో రూ.3 లక్షల జడ్పీటీసీ నిధులతో హైమాస్ట్ లైట్లను న్యాల్కల్ జెడ్పిటిసి స్వప్న భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ గత 50 యేండ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయంటే అది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అని తెలిపారు. కాబట్టి మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి విడతల వారిగా తనవంతుగా కూడా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మహిపాల్, శంకర్, అరుణ్, జీవన్, శామ్యూల్, సుందర్, వినయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో

నవతెలంగాణ-జిన్నారం



మండల కేంద్రమైన జిన్నారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా జిన్నారం ఎంపీడీవో రాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ను స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు యువకులు అభినందించే శాలువాలతో సత్కరించారు. జిన్నారం మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ ఆఫీసర్లను ప్రత్యేక అధికారులుగా అధికార యంత్రాంగం నియమించింది. జిన్నారం కాజిపల్లి పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో రాములు, గడ్డపోతారం లక్ష్మీపతి గూడెం పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా ఎంపీఓ సంతోష్ కుమార్ ను, కొడకంచి శివనగర్ గ్రామపంచాయతీలకు తాసిల్దార్ రవికుమార్, సోలక్పల్లి, ఊట్ల గ్రామ పంచాయతీలకు మండల వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్ రెడ్డిని, మంగంపేట మాదారం గ్రామ పంచాయతీలకు పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్ మల్లేశం, జంగంపేట గ్రామపంచాయతీకి మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ ధరణి, నల్తూరు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా రోడ్లు భోనాల అసిస్టెంట్ ఇంజనీర్ రామం రాజులను ప్రత్యేక అధికారులుగా అధికార యం్ర తాంగం నియమించింది. గ్రామ పంచాయతీ ప్రజా ప్రతిని ధుల పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు ఏర్పాటు చేసింది. ఆయా గ్రామ పంచాయతీల్లో పలు అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

మండల ప్రత్యేక అధికారిని కలిసిన మైత్రి ఫౌండేషన్ చైర్మెన్



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన వెనుకబడిన తరగతుల సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డిని మైత్రీ ఫౌండేషన్ చైర్మెన్ చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ గుమ్మడిదల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. శుక్రవారం నుంచి మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ రాములు సంగీత, శ్రీనివాస్ రెడ్డి, వినోద్ కుమార్, పద్మ, ప్రత్యూష, విష్ణు వర్ధన్ చారి తదితరులు ఉన్నారు

జిన్నారం ఎంపీపీపై అవిశ్వాసానికి ఫిర్యాదు



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మ గౌని రవీందర్ గౌడ్‌పై అవిశ్వాసం పెట్టాలంటూ సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డికి జిన్నారం మండలానికి చెందిన ఐదుగురు ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాదారం, ఊట్ల, సోలక్ పల్లి, శివానగర్, జిన్నారంకు చెందిన ఎంపీటీసీలు ఆకుల భార్గవ్, జిన్నారం మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంగు రమేష్, ఎలిమెల స్వాతి, బత్తుల సంతోష, గౌండ్ల వెంకటేశం గౌడ్ బృందం జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ వినతి పత్రాన్ని ఆర్డీవో రవీందర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ జిన్నారం మండలంలో ఎంపీపీ రవీందర్ గౌడ్ నియంత పాలన కొన సాగిస్తున్నాడని ఆరోపించారు. గ్రామాలలో కార్యక్రమాలకు సంబంధించి ఎంపీటీసీలకు సమాచారం లేకుండా ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఏకపక్ష విధానాలకు పాల్పడం ఏమిటంటూ ప్రశ్నించారు. కాగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టాలని అధికారులకు ఫిర్యాదు చేయడం జిన్నారం మండలంలో రాజకీయ రసవత్తరమైన చర్చకు తెర తీసింది.

ప్రత్యేక అధికారిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-పటాన్‌పల్లి

జనవరి 31తో గ్రామపంచాయతీ సర్పంచ్ల పదవి కాలము ముగింపు కావడంతో ప్రభుత్వము గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న యూసుబ్‌ను మేడికుంద గ్రామ పంచాయతీకి నియమించడంతో స్పెషల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు యూసుబ్‌ను కాంగ్రెస్ నాయకులు గ్రామపట్టణ అధ్యక్షులు కచ్చురావుద్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. ఆయనతోపాటు కార్యదర్శికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వారీలు, క్రషర్లపై అధికారుల సర్వే

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గల కంకర క్రషర్లు క్వారీలపై అధికారులు సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిధిలో మాదారం సోలక్పల్లి ,నల్తూర్, ప్రాంతాల్లో మైన్స్ విభాగం మధు కుమార్, రాయల్టీ ఇన్స్పెక్టర్ సైదులు డిప్యూటీ ఇన్స్పెక్టర్ సర్వే విభాగం బాలరాజ్, జిన్నారం మండల సర్వేయర్ రామభద్రం, రామచంద్రపురం పిసిబి ఈ కుమార్ పాటక్ సంగారెడ్డి డివిజన్‌కు సంబంధించిన పలువురు ఆర్ఐ సర్వేయర్ల బృందం ఇతర అధికారులు పాల్గొన్నారు. మొత్తం 41 క్వారీలు కంకర క్రషర్లలో భాగంగా 22 క్రషర్ల క్వారీల సర్వే పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు.



16న జరిగే దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



నవతెలంగాణ- కొండపాక

ఈ నెల16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కుకునూరు పల్లి తహసిల్దార్ మల్లికార్జున్ రెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, 2022 విద్యుత్తు సవరణను మానుకోవాలని, రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని సమ్మె చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉమ్మడి మండల కార్యదర్శి అమ్ముల బాల నరసయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బర్మ కొమురయ్య, ఉమ్మడి మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల నర్సింలు, జాలిగామ ప్రభాకర్, కుకునూరు పల్లి మండల నాయకులు మీ సాయిలయ్య, సాయి కుమార్, రవికుమార్, నరహరి, పోచయ్య లక్ష్మణ్, లక్ష్మి నరసవ్వ, వెంకటవ్వ, బిక్షపతి, కనకయ్య, కిష్టయ్య పాల్గొన్నారు

గుడుంబా పట్టివేత



నవతెలంగాణ-అక్కన్నపేట

మండల కేంద్రంలో గుడుంబా విక్రయిస్తున్న కుతాటి పోచయ్య పై కేసు నమోదు చేసినట్లు అక్కన్నపేట ఎస్సై తాండ్ర వివేక్ శుక్రవారం తెలిపారు. గుడుంబా విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా ఐదు లీటర్ల నిషేధ గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరి కొంతమంది అనుమానిత ఇళ్లపై తనిఖీలు చేసి గుడుంబా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వివేక్ హెచ్చరించారు.

పరిశోధన రంగంలో జగదీశ్వరచారికి అవార్డు



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ తూమోజు జగదీశ్వరచారికి అవుట్ స్టాండింగ్ ఎక్సలెన్స్ ఇన్ రిసెర్చ్ కమల్ పాత్ర అవార్డు లభించిందని జూనియర్ చాంబర్ ఇంటర్నెషనల్ జిల్లా అధ్యక్షుడు రాజు తెలిపారు. ప్రతియేడు జెసీఐ పలు రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేస్తామన్నారు. ఇందులో భాగంగానే జగదీశ్వరచారి అవార్డుకు ఎన్నికైనట్లు తెలిపారు. ఆయన ప్రస్తుతం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. అలాగే సుమారు 20 అంతర్జాతీయ స్థాయిలో తమ పరిశోధన పత్రాలను వెలువరించారన్నారు. గూగుల్ స్కాలర్, రిసర్చ్ గేట్‌లలో పొందుపర్చబడ్డాయని, అంతేకాకుండా ఐదు అంతర్జాతీయ పత్రికలకు రివ్యూ మెంబర్‌గా, ఎడిటర్‌గా ఉన్నారు. మూడు పుస్తకాలను రచించారు. నర్సయ్య భవన్, మంచిర్యాలలో జరగబోయే సమావేశంలో అవార్డు అందించనున్నట్లు తెలియజేశారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల మిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నకిలీ ట్రాన్స్‌జెండర్‌కు దేహశుద్ది చేసిన హిజ్రాలు

జోగిపేటలో రోడ్డుపైన ఘటన..

నవతెలంగాణ జోగిపేట

నకిలీ ట్రాన్స్ జే ండర్‌గా చలామణి అవుతూ వ్యాపార సంస్థల్లో డబ్బులు వసూళ్లు చేస్తున్న వ్యక్తిపై ట్రాన్స్ జెండర్‌లు దేహశుద్ధి చేశారు. శుక్రవారం జోగిపేట పట్టణంలోని గౌని వద్ద చోటు చేసుకుంది. జోగిపేట పట్టణానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు తాను ట్రాన్స్‌జెండర్‌నంటూ మహిళల వస్త్ర వేషధారణతో వ్యాపార సంస్థల్లో డబ్బులను వసూళ్లు చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఇక్కడి ప్రాంతం చూస్తున్న ట్రాన్స్ జెండర్‌లు అతనిని పట్టుకొని నిలదీశారు. అతని వద్ద నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అతనికి దేహశుద్ధి చేశారు. అతని ఒంటిపై ఉన్న బట్టలను విప్పేసారు. ఈ ఘటన రోడ్డుపై ప్రజల మధ్య జరుగుతున్న వారి గొడవను ఆపేందుకు ఎవ్వరూ కూడా సహసించలేదు. సదరు యువకుడిపై ట్రాన్స్ జెండర్‌లు దేహశుద్ధి చేస్తున్న దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లలో వీడియో చిత్రికరణ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇదిలావుండగా ట్రాన్స్ జెండర్‌ల విషయంలో వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. డబ్బులను దౌర్జన్యంగా వసూళ్లు చేస్తున్నారని, ఇవ్వకపోతే ఆసభ్యంగా దుకాణాల ముందే ప్రవర్తిస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో చేసేది లేక వారు అడిగినంతా ఇవ్వక తప్పడం లేదని చెబుతున్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ జగదేవపూర్

ఉపాధి పనులను కూలీలు సద్విని చేసుకోవాలని ఏపీడి కౌసల్య దేవి పేర్కొన్నారు. ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా మండలంలోని రాయవరం గ్రామంలో కూలీలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు చేతినిండా ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ఉపాదాయం పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు తప్పకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరంలో 100 రోజులు పనులను కూలీలు చేయాలని దీంతో రోజువారి వేతనం 270కి తగ్గకుండా చూసుకోవలసిన బాధ్యత కూలీలపైందన్నారు. అలాగే ఉపాధి పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మి, ఎంపీ ఓ శ్రీనివాస్ వర్మ, టి ఏ లు రాజు, కరుణాకర్ రెడ్డి, నరేష్, తిరుపతిరెడ్డి, నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు యాదగిరి, గౌస్ కూలీలు పాల్గొన్నారు.

బోలేరా వాహనం బైకు ఢీ కోని వ్యక్తి మృతి



నవతెలంగాణ: జోగిపేట

బోలేరా వాహనం ఢీ కోని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జోగిపేట పట్టణంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ కథనం ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. జోగిపేట పట్టణానికి చెందిన సావిడి మధు, మరో ఇద్దరితో కలిసి ద్విచక్రవాహనంపై చింతకుంట నుంచి జోగిపేటకు వస్తుండగా భారత్ పెట్రోల్ పంప్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న బోలేరా వాహనం బైకును ఢీ కోట్టింది. దీంతో బైకుపై ఉన్న సావిడి మధు (40) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతుని కుటుంబీకులు, స్నేహితులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన సంగమేశ్వర్ అనే వ్యక్తిపై దాడి చేశారు. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గొడవను నిలువరించే ప్రయత్నించి, సంగమేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

16న దేశ వ్యాప్త సమ్మె నోటీసులు



నవతెలంగాణ- జహీరాబాద్

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెకు సంభందించి మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలో ఎంవిఐ కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులకు సమ్మె నోటీసులు అందజేసినట్లు సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, మహిపాల్ తెలిపారు. ఆయా రంగాలకు చెందిన కార్మికులు 16న జరిగే సమ్మెలో పాల్గొనాలని కోరారు.

చిరుధాన్యాలు అన్నింటికీ ప్రత్యామ్నాయం

-డిడిఎస్ మహిళా రైతులు



నవతెలంగాణ - ఝరాసంగం

ప్రస్తుతం చిన్న వయసు పిల్లలకు కూడా షుగర్, బీపీ, వ్యాధులు వస్తున్నాయని, ఇటువంటి పరిస్థితులలో చిరుధాన్యాల తిండే అన్ని అనారోగ్య సమస్యలకు పరిష్కారమని డిడిఎస్ మహిళలు అన్నారు. శుక్రవారం ఝరాసంగం మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామంలో 24 వ పాత పంటల జాతర కార్యక్రమాన్ని డిడిఎస్ గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు కలిసి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో చిరుధాన్య ల పంటలు కనుమరుగైపోతున్న నేపథ్యంలో గ్రామంలోని రైతులు కనీసం ఒక ఎకరంలో చిరుధాన్యాలను పండించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఫలితంగా పశువులకు, అటు పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. చిరుధాన్యాలు పండించిన రైతులకు మార్కెటింగ్ సదుపాయంతో పాటు రైతులకు బోనస్, పంట బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సూపర్వైజర్ బాలయ్య సమతా సైనిక్ దల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబ్రాజ్, డిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్ మాజీ పాలకవర్గ సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని లింగాపూర్, మాజీ పాలకవర్గ సభ్యులకు పంచాయతీ కార్యదర్శి రాజు, గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ముక్క కనకయ్య, మాజీ ఉపసర్పంచ్ జెల్లా స్వరూప శ్రీనివాస్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు.

డబుల్ ఇళ్ల నిర్మాణం...పంపిణీలో భారీ అవినీతి

బీఆర్ఎస్ నేతలు తెలంగాణ సంపదను దోచుకున్రు

కాంగ్రెస్ సర్కార్ ప్రజల ప్రభుత్వం - చెరుకు శ్రీనివాస్ రెడ్డి





నవతెలంగాణ -దుబ్బాక

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం, వాటి పంపిణీలో భారీ అవినీతి జరిగిందని, బీఆర్ఎస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి తెలంగాణ సంపదను దోచుకున్నారని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. త్వరలోనే విచారణ చేపట్టి తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 17వ వార్డులో పలు వీధులను, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, రెండు పడకల ఇండ్ల సముదాయాన్ని ఆయన పరిశీలించారు. 17వ వార్డులో కరెంట్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు, కేజీబీవీలో టాయిలెట్లు, కాంపౌండ్ వాల్ సమస్య, రెండు పడకల ఇండ్ల సముదాయంలో త్రాగునీటి సమస్య ప్రధానంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. త్వరలోనే సంబంధిత అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా రూ.2 కోట్ల ఎస్ డీ ఎఫ్ నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా పలు పాఠశాలలు, హాస్టల్లో నెలకొన్న సమస్యల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కూడవెళ్లి వాగులోకి నీటి విడుదల కోసం జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అనంతుల శ్రీనివాస్, నర్మెట యేసురెడ్డి, కొంగర రవి, కడుదూరి నరేందర్ రెడ్డి, బాస మధు, తొట్ల చంద్రం, మంద శ్రీనివాస్, ఇస్తారిగల్ల మల్లేష్, ఆకుల భరత్, వినయ్, శ్రీరామ్ నరేందర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపుర వచ్చి చూడండి

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



నవ తెలంగాణ - సిద్దిపేట

త్రిపుర రాష్ట్రం భౌగోళికంగా చిన్నది అయినప్పటికీ, అభివృద్ధిలో ముందు ఉందని, ప్రకృతి అందాలకు నెలవనీ, ఆ రాష్ట్రాన్ని పర్యాటకులు సందర్శించాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి కోరారు. శుక్రవారం జగిత్యాలలో పౌర సన్మాన కార్యక్రమానికి వెళ్తుతూ బీజేపీ సీనియర్ నాయకులు వంగ రామచంద్రారెడ్డి ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సెవన్ సిస్టర్స్ గా పిలిచిన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, మిజోరాం, నాగలాండ్, త్రిపుర రాష్ట్రాలకు తోడు సిక్కింను కలుపుకొని అష్టలక్ష్మీ రాష్ట్రాలుగా నేడు పిలుచుకుంటున్నామన్నారు. త్రిపుర సౌత్ ఈస్ట్ ఏసియాకు భూమార్గం ద్వారా వెళ్లే ప్రాంతం, చిట్టగాన్ పోర్ట్ ప్రారంభమైతే 8 రాష్ట్రాలకు గేట్ వేగా మారబోతుందన్నారు. రాజధాని అగర్తల బిజినెస్, మెడికల్ హబ్ గా మారిందని, రాబోయ్యే రోజులల్లో టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. త్రిపుర రాష్ట్రానికి 850 కిలోమీటర్లు బంగ్లాదేశ్ సరిహద్దు ఉందన్నారు. త్రిపుర రాష్ట్రంలోని రబ్బర్, అగర్ వుడ్ మంచి పంటలు అని, అగర్ వుడ్ అయిల్ విదేశాలకు ఎగుమతి చేయబడుతుందన్నారు. త్రిపుర రాష్ట్రానికి తాను గవర్నర్‌గా నియమించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. త్రిపురలో 30-40 శాతం ట్రైబల్స్, 18 శాతం వరకు వివిధ వర్గాలు, భాషలకు చెందినవారు ఉన్నారన్నారు. అయా భాషలకు లిపినీ అక్కడి ప్రభుత్వం తయారుచేస్తున్నారు. గవర్నర్‌గా నియమితులైన సమయంలో ఎన్నికలు ఉండటంతో ఎవ్వరిని కలువడానికి వీలులేకుండా పోయిందన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రానికి వచ్చానని అన్నారు. అనంతరం ఆయనను బిజెపి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బీజేపీ సిద్దిపేట నియోజక వర్గ ఇంచార్జి దూది శ్రీకాంత్ రెడ్డి, బాసంగారి వెంకన్న, ఉపేందర్ రావు, బీజేపీ నాయకులు అంబటిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ మట్టిని తరలిస్తే కఠిన చర్యలు

నాలుగు టిప్పర్‌లను సీజ్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-మనోహరాబాద్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన కొండాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి దాడులు చేసినట్టు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు.

వివాహిత మహిళ అదృశ్యం

నవతెలంగాణ-మనోహరాబాద్ : కంపెనీకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని కూచారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామానికి చెందిన పెద్దింటి లావణ్య (26) గత 31న ఉదయం 8 గంటల ప్రాంతంలో గ్రామ శివారులోగల ఫ్యాన్ కంపెనీకి పనికై వెలుతున్నట్టు ఇంట్లో చెప్పి వెళ్లినట్టు తెలిపారు. కానీ సాయంత్రం వరకు కూడా తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. దాంతో బంధువులు, చుట్టు పక్కల వెదికినప్పటికి ఫలితం లేకపోవడంతో శుక్రవారం మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. దాంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పూర్ణాహుతి యజ్ఞం

పాల్గొన్న ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవ తెలంగాణ-నర్సాపూర్ : ఎమ్మెల్యేగా సునీత లక్ష్మారెడ్డి మొట్టమొదటిసారిగా క్యాంప్ కార్యాలయంలో అడుగు పెడుతున్న తరుణంలో శుక్రవారం నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పూర్ణాహుతి యజ్ఞం కార్యక్రమలతో పాటు వాస్తు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జెడ్పి చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ దుర్గప్ప గారి అశోక్ గౌడ్, పట్టణ అధ్యక్షులు పంబల బిక్షపతిలు పూజలో పాల్గొని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భోగ చంద్రశేఖర్, రింగుల ప్రసాద్, జ్ఞానేశ్వర్ గుప్తా, సాగర్, ఆంజనేయులు గౌడ్, కుమ్మరి నాగేష్, చెవిటి బాలరాజ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యాసంగిలో రైతుబంధు రూ.210 కోట్లు పెండింగ్

జిల్లాలో యాసంగి లో 35 వేల ఎకరాల్లో వరి పంట సాగు

42వేల ఎకరాల్లో పట్టి పంట

జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు



నవతెలంగాణ- జోగిపేట

సంగారెడ్డి జిల్లాలో 79568 మంది రైతులకు గాను రైతుబంధు రూ.210.87 ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, ఇప్పటివరకు యాసంగి సీజన్లో జిల్లాలో 35 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు తెలిపారు. శుక్రవారం ఆందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్లో రైతులకు రైతుబంధు జిల్లాలో 3,62,143 మందికి రూ.375.21 కోట్లకు గాను, ఇప్పటివరకు 2,82,575 రైతులకు గాను 164.34 కోట్లు మాత్రమే ప్రభుత్వం వారి వారి అకౌంట్లోకి జమ చేసిందన్నారు. ఇంకా 79568 మంది రైతులకు గాను 210.87 కోట్లు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. రైతులు ఇంకా నారు దశలో మరి కొంతమంది ఉన్నారని, సాగు విస్తీర్ణం కొద్దిగా పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లాలో 42 వేల ఎకరాలలో జొన్న పంటను సాగు చేస్తున్నారని ఆయన తెలిపారు. రైతులు పంటల సాగులో మెలకువలను పాటించాలని ఆయన సూచించారు. చీడపీడల నివారణ చర్యలను వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో కాండం తలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని ఆయన తెలిపారు. అందోల్ మండలంలో 18 వేల ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ రత్న, వ్యవసాయ విస్తీర్ణ అధికారి అనిత, రైతులు నర్సింలు, సీతారా%శీ%, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ జగదేవపూర్ : జగదేవపూర్ మండల కేంద్రంలో గల ఎంపిడిఓ కార్యాలయంలో మండల ఎంపిపి బాలేశం గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు గ్రామాలలోని స్పెషల్ ఆఫీసర్లకు మరియు పంచాయతీ కార్యదర్శులకు స్పెషల్ ఆఫీసర్ల పాలనపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండాలని వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి , తహశీల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిపల్లిలో దొంగల బీభత్సం

తాళమున్న మూడిళ్లలో చోరీ



నవతెలంగాణ - కొండపాక

కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గుర్తుపట్టకుండా ఉండడం కోసం సీసీ కెమెరాలు పగలగొట్టి తాళం వేసి ఉన్న మూడిళ్లలో చోరీ చేసిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సున్నం రాజయ్య కుటుంబ సభ్యులు లకుడారంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. ఇంటి తాళాలు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి ఇంట్లో ఉన్న లక్షా 50 వేల నగదును ఏడు తులాల బంగారం ఆభరణాలను చోరీ చేశారు. అలాగే గ్రామానికి చెందిన ఆరేటి సత్యవ్వ ఇంట్లో ఆమె ఒకరే నివసిస్తుంది. రాత్రిపూట పక్కింట్లో నిద్రిస్తుంది. రోజువారీ గానే ఆమె పక్కింట్లో నిద్రకు వెళ్లింది. తెల్లారి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఆ రోజే బ్యాంకు నుంచి తెచ్చుకున్న పింఛన్ డబ్బులు ఆరువేల నగదు, రెండు తులాల బంగారం చోరీ అయ్యాయి. కావటిప్రవీణ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో ఇంటికి తాళాలు వేసి కొమరవెల్లికి వెళ్లారు ఉదయం వచ్చి చూసేసరికి ఇంట్లోనే వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. ఇంట్లో ఉన్న వెండి ఆభరణాలు, 5వేల నగదు చోరీ జరిగింది. శుక్రవారం కుకునూరు పల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవు



నవతెలంగాణ-కోహెడ : మండలంలోని దుకాణాదారులు మత్తు పదార్థాలను అమ్మితే చట్టరీత్య చర్యలు తప్పవని కోహెడ ఎస్సై సిహెచ్. తిరుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాన్‌షాపులు, బేకరి షాపులలో నిషేధిత మత్తు పదార్థాలు అమ్మ వద్దని సూచిస్తూ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి లాంటి మత్తు పదార్థాలను తీసుకొని యువత చెడు వ్యసనాలకు పాల్పడవద్దన్నారు. పేకాట, జూదం లాంటి ఆటలతో కుటుంబం ఆర్థిక నష్టలలోకి నెట్టివేయబడుతుందని హెచ్చరించారు. అలాగే దుకాణాదారులు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. అనుమానస్పదంగా గంజాయిలాంటి మత్తు పదార్థాలు తరలించే వారు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. ఆయనవెంట కానిస్టేబుల్ రమేష్, తదితరులు ఉన్నారు.

నకిలి విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

నవతెలంగాణ-కోహెడ : నకిలీ విత్తనాలు అమ్మితే చట్టరీత్య చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్, అశ్విని, అగ్రోస్, గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ డీలర్ తప్పకుండా 10 టన్నుల యూరియా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే మెషిన్‌తోనె అమ్మకాలు జరపాలని, స్టాక్ బుక్, బిల్‌బుక్ ఉండేలా చూసుకోవాలని లేనట్లయితే 1985 చట్ట ప్రకారం సదరు డీలర్‌పై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం 500 ఎంటీ యూరియ ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని వరికోలు గ్రామ వరిచేన్లను వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌తో కలిసి పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉందని దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్, విస్తరణ అధికారులు శివకుమార్, రూప, మహిపాల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం ఇద్దరు మృతి





నవతెలంగాణ-కొల్చారం

అదుపుతప్పిన ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి కొల్చారం లోతువాగు మూలమలుపు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు మహమ్మద్ (55), అదే గ్రామానికి చెందిన ఆరిఫ్ (50)లు శుక్రవారం కౌడిపల్లి నుంచి కొల్చారంకు ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరిఫ్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహమ్మద్‌ను చికిత్స నిమిత్తం108 సాయంతో మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-బెజ్జంకి : ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్ట్ లోయలో పడిపోవడంతో యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రమాద ఘటన ప్రాంతాన్ని ఎస్ఐ నరేందర్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. రోడ్డు ప్రమాద సంఘటన వివరాలను ఎస్ఐ వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన బండిపెల్లి శ్రీనివాస్ (25) ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి గురువారం సాయంత్రం సమయంలో బయలుదేరి వెళ్లాడు. రాత్రి సమయంలో ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, స్నేహితులు ఆరా తీశారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమీపంలోని గుండారం రోడ్డు మార్గంలో వెళ్తు ద్విచక్ర వాహనంతో సహా కల్వర్ట్ లోయలో పడి బండిపెల్లి శ్రీనివాస్ మృతి చెంది ఉంటాడని, శుక్రవారం తెల్లవారుజామున గ్రామస్తులు గమనించి తల్లిదండ్రులకు సమచారం అందించారు. మృతుని తండ్రి బండిపెల్లి పర్శరాములు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. మృతునికి భార్య రజిత, కూతురు (10 నెలలు) వేదాక్షిలు ఉన్నారు.

జప్తి నాచారంలో జరిగిన ఘర్షణపై ఎస్ఐ విచారణ



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం జప్తి నాచారం గ్రామంలో గురువారం జరిగిన ఘర్షణపై కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ శుక్రవారం విచారణ చేశారు. గ్రామ పంచాయతీల పాలన ముగియడంతో గురువారం పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ తలెత్తింది. దాంతో ఇరు వర్గాల వారు దాడి చేసుకున్నారు. ఈ విషయంలో ఇరు వర్గాల వారు కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడంతో ఎస్సై పుష్పరాజ్ విచారణ చేపట్టారు. ఆ సమయంలో ఉన్న వ్యక్తులతో జరిగిన విషయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విచారణలో తేలిన అంశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేబర్తిలో ఉపాధి కూలీలకు అవగాహన

నవతెలంగాణ-మద్దూరు : మండలంలోని రేబర్తి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ దినోత్సవం సందర్భంగా టిఏ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్‌లు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యా మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కొండపాక : టిపిటిఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను కొండపాకలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 11, 12 తేదీలలో ఖమ్మంలో విద్యా విజ్ఞాన మహాసభలు జరుగుతున్నట్లు టిపిటిఎఫ్ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి పేర్కొన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ రామస్వామి మండల బాధ్యులు కనకయ్య రాములు మండల నోడల్ అధికారి విఠల్ తదితరులు పాల్గొన్నారు.